
Follow: @ANNTELUGU
ANN తెలుగు
03-03-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 65 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## స్వగ్రామంలో విజయ్, రష్మిక దంపతుల సందడి

### 32 ఏళ్ల తర్వాత సొంతూరుకు

**నూతన ఫామ్ హౌస్‌లో ప్రత్యేక పూజలు**

**5వేల మంది అభిమానులకు భోజనాలు**


**నాగర్ కర్నూల్, మహా:** స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మన్‌పేటలో విరోష్ జంట సందడి చేసింది. ఇటీవలే రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వివాహబంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక నూతన దంపతులు కొత్తగా నిర్మించిన ఫాంహౌస్‌లో సత్యనారాయణ వ్రతం చేసి పెళ్లివిందు చేశారు. వివాహబంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ రష్మిక దంపతులు నాగర్‌కర్నూల్ జిల్లాలో సందడి చేశారు. 32 ఏళ్ల తర్వాత విజయ్ సొంతూరు తుమ్మన్‌పేటకు వచ్చిన విరోష్ జంటను గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇటీవలే రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్న విజయ్‌దేవరకొండ, రష్మికలకు స్థానికులు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### వారిని టచ్ చేస్తే బుల్డోజర్లతో వస్తా...


- కేంద్రమంత్రి సంజయ్ వార్నింగ్



02

### ఖమ్మం వర్సెస్ కేరళ

- కాంగ్రెస్ వస్తే పేదల ఇళ్ళు కూలుతాయని విజయన్ ట్వీట్
- మంత్రి పొంగులేటి కౌంటర్



02

### నేడు సంపూర్ణ చంద్రగ్రహణం



**ఢిల్లీ:** ఈ నెల మూడో తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఆ రోజు ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని తెలిపింది. చంద్రగహణాన్ని వీక్షించే అవకాశం తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉంటుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా గ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలకే ప్రారంభమైనప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాతే ప్రభావం కనిపిస్తుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉంటుందని తెలిపింది. మళ్లీ ఇలాంటి చంద్ర గ్రహణం 2028, జూలై 6న ఏర్పడుతుందని వెల్లడించింది.



# ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం

## అనంతగిరి హిల్స్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ

### బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్ లో ప్రైవేట్ బిల్లు పెడతాం

### ట్రంప్ అంటే ప్రధాని మోడీకి భయం

### మోడీ దుర్మార్గాలాను ఒక్కొక్కటిగా బయటపెడతున్నాం

**వికారాబాద్, మహా :** ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తొలిసారి స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టనున్నట్టు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయట పెడుతున్నామని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డీసీసీ చీఫ్ లకు రాహుల్ గాంధీ సూచించారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ కితాబిచ్చారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు వికారాబాద్ జిల్లా అనంతగిరిలో జరిగిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమానికి ఇవాళ రాహుల్ గాంధీ హాజరైన రాహుల్ గాంధీ మాట్లాడుతూ, తెలంగాణలో జన గణన పూర్తి చేసి బీసీ జనాభా తేల్చినా కేంద్రం వారికి రావాల్సిన రిజర్వేషన్లపై తాత్సారం చేస్తుందని, దీన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నిస్తామని, బీసీ రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెడుతామన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానం సక్రమంగా లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో అమెరికన్ ట్రేడ్ డీల్ తో ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోడీ అనుసరిస్తున్న విదేశాంగ విధానం లోపభూయిష్టంగా ఉందని, ఈ విదేశాంగ విధానం వల్ల భవిష్యత్ లో భారత్ భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## దేశం కోసం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

### సోనియా గాంధీ ఫేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చాం

**మోడీపై రాజీలేని పోరు వల్లే రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత అయ్యారు**

**డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**వికారాబాద్, మహా :** దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వికారాబాద్‌లోని హరిత రిసార్ట్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘటన సృజన్ అభియాన్ అనే నామకరణం చేశారు. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు.

మిగతా 2లో



# ఇరాన్‌తో దీర్ఘకాలిక యుద్ధం

### అన్నింటికీ సిద్ధంగానే ఉన్నాం.. ట్రంప్ సంచలన ప్రకటన

## మరిన్ని భీకర దాడులు చేస్తాం

ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు: ట్రంప్ హెచ్చరిక

ఇరాన్ పై దాడుల్లో 555మంది మృతి.. ఇరాన్ లో 131 నగరాలపై దాడులు



**మహా నెట్ వర్క్:** మరిన్ని భీకర దాడులు చేస్తామని, ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ దాడులు, ప్రతిదాడులు మూడో రోజు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, తమ జోలికి ఎవరు వచ్చినా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. త్వరలో మరిన్ని తీవ్ర దాడులు ఉంటాయని తెలిపారు. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, వారు ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని అమెరికా కలిగి ఉందని, దానిని ఇప్పుడు ఉపయోగిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ సాఫీగా, తమకు ఎలాంటి ఇబ్బందిలేకుండా సాగుతోందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ఇరాన్ ప్రజలు నియంత పాలన నుంచి స్వేచ్ఛ పొందడానికి అమెరికా ఈ సైనిక చర్యకు ఉపక్రమించిందని అన్నారు. ఇరాన్ ఇలాగే దాడులు కొనసాగిస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై అసలైన దాడిని ఇంకా ప్రారంభించలేదని, ఆ దేశం ఇలాగే వ్యవహరిస్తే దాడి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఆయన ఓ ఛానల్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తో దీర్ఘకాల యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ట్రంప్ తేల్చడం సంచలనంగా మారింది.

మిగతా 2లో

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఎఫెక్ట్

### దుబాయ్‌లో చిక్కుకుపోయిన మంత్రి తుమ్మల

**క్షేమంగా ఉన్నట్లు సమాచారం**



**మహా :** అమెరికా సహాయంతో ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం ప్రకటించింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు సహా ఆ దేశానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడికి దిగుతోంది. ఇజ్రాయెల్ సహా పలు గల్ఫ్ దేశాలపై దాడులు తీవ్రతరం చేసింది. ముఖ్యంగా ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని విరుచుకుపడుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశాలు తమ గగనతలాలను పూర్తిగా మూసివేసి విమాన సర్వీసులను నిలిపివేశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకున్నారు. ఐదు రోజుల క్రితం మంత్రి తుమ్మల దుబాయ్ వెళ్లగా యుద్ధం కారణంగా అక్కడే చిక్కుకుపోయినట్లు సమాచారం.

మిగతా 2లో



## మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లోకి..

### ఆదిలాబాద్ నుండి నలుగురు కీలక సర్పంచ్ లు, ముఖ్యనేతల చేరిక

**కంది శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో చేరిన నేతలు**

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావు సమక్షంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని నాలుగు కీలక గ్రామాల సర్పంచ్ లు, పలువురు వార్డుసభ్యులు, ముఖ్యనేతలు కంది శ్రీనివాసరెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరారు. భోరజ్, నిరాల, బట్టిసావర్గాం తో పాటు పలుగ్రామాల సర్పంచ్ లు, వార్డుసభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ ఛైర్మన్ సంతోష్ రావు, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఖయ్యూం తదితర నేతలు పాల్గొన్నారు.

## ఇరాన్ దాడులను ఖండించిన ప్రధాని మోదీ


### బహ్రెయిన్, సౌదీ రాజులకు ఫోన్ కాల్స్

**భారతీయుల బాగోగులపై ఆరా..**

**గల్ఫ్ దేశాలపై దాడి దారుణం**

**మహా:** పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ వేళ బహ్రెయిన్ రాజు హమాద్ బిన్ ఈసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌లతో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం మాట్లాడారు. ఆ రెండు దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఇక ఇదే సమయంలో బహ్రెయిన్, సౌదీ అరేబియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల బాగోగులపై ప్రధాని ఆరా తీశారు. బహ్రెయిన్ రాజు, సౌదీ యువరాజుకు మోదీ చేసిన ఫోన్ కాల్ సంభాషణల వివరాలను భారత ప్రభుత్వ అధికార వర్గాలు మీడియాకు వెల్లడించాయి. అంతకుముందు ఆదివారం రోజు యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు కూడా భారత ప్రధాని ఫోన్ కాల్ చేశారు. యూఏఈపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఆ దాడుల వల్ల యూఏఈలో ప్రాణాలు

మిగతా 2లో



# ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడి కనుసన్నల్లో ప్రధాని మోడీ పని చేస్తున్నారని, ట్రంప్ అంటే మోడీ భయమని అన్నారు. పాకిస్తాన్ తో యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ పదే పదే చెబుతున్నా మోడీ ఆ విషయంపై దేశ ప్రజలకు శ్పష్టత ఇవ్వక పోవడం చూస్తుంటే ఆయన పని తీరు ఎలా ఉందో స్పష్టమవుతుందన్నారు. 12 ఏళ్ళ నరేంద్ర మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అదోగతి పాలైందని, ఆయన అనుసరిస్తున్న విధానమే ఇందుకు కారణమన్నారు. దేశ ప్రజల్లో విద్వేషాలను రేకెత్తించడమే పనిగా పెట్టుకుని పని చేస్తున్నారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోడీ ద్వంద్వ వైఖరి, విధానాలపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ లో ప్రతి నిత్యం అనేక అంశాలపై ప్రశ్నిస్తున్నామని, ఏ అంశంపై కూడా మోడీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని పేర్కొన్నారు. విదేశాంగా విధానంగా ఎప్టిన్ ఫైల్స్ కు సంబంధించి కానీ, దేశ రక్షణ అంశం కానీ ప్రజా సమస్యలపై కానీ ఇలా ఏ రంగంపై ప్రశ్నించిన దాటవేత దోరణిని అవలంభించడంపై ప్రజలను జాగరూకులను చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. రాబోయే కాలంలో అడుగడుగునా మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తాము లేవనెత్తిన ప్రతి అంశం ప్రజలకు సంబంధించేనని, ప్రజల ముందు నరేంద్ర మోడీని దోషిగా నిలబెడతామన్నారు.

## దేశం కోసం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, కేసీ వేణు గోపాల్, సీఎం రేవంత్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజా సమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. ఆదివారం కూడా తాను కోర్టుకు వెళ్లి వచ్చానని తెలిపారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి సీఎం వరకు అన్ని పదవులు చూశానని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పుకొచ్చారు. అయితే ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం సంపాదించానని వివరించారు.ఈ క్రమంలో తనపై అనేక కేసులు పెట్టారని, పరువు నష్టం దావాలు కూడా వేశారని వెల్లడించారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని స్పష్టం చేశారు. సోనియా గాంధీ పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చామన్నారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేతగా అయ్యారన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అనేక విషయాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ కౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. పది రోజులపాటు కొనసాగిన ఈ శిక్షణ శిబిరంలో పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధి, ప్రజలతో అనుసంధానం, ఎన్నికల వ్యూహరచన వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన డీసీసీ అధ్యక్షులు తమ తమ జిల్లాల రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయి నిర్మాణం, ప్రజా సమస్యలపై పార్టీ స్పందన తదితర అంశాలను విశ్లేషిస్తూ అనుభవాలను పంచుకున్నారు.

## వారిని టచ్ చేస్తే బుల్డోజర్లతో వస్తా...

**కేంద్రమంత్రి సంజయ్ వార్నింగ్**

**కామారెడ్డి, మహా:** హైదరాబాద్ నగరంలో హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లను నిర్మిస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కూల్చివేత ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. హైడ్రాకు పెద్దవాళ్ల ఇళ్లు కనిపించడం లేదని ఆరోపించారు. కేవలం పేదల ఇళ్లు మాత్రమే కూల్చుతున్నారని అన్నారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఎన్ని ఇళ్లను కూల్చివేశారో లెక్కలు తీయడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తే.. పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని బండి సంజయ్ సంచలన వార్నింగ్ ఇచ్చారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలో భూదాన్ పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సమాజం జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. హిందువులు రోడ్ల మీదకు వచ్చి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మెడలు వంచాల్సిందేనని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలాంటి దాడులను భరిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బొట్టు పెట్టుకుని దేవుడిని మొక్కడంతో సరిపోదని అన్నారు. దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు స్పందించని వాడు హిందువే కాదని బండి సంజయ్ అన్నారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేసినా, మరే గుడిపై దాడి చేసినా స్పందించేది బజరంగ్ దళ్, హిందూవాహిని, హిందూ సంస్థలు, బీజేపీ మాత్రమే అన్నారు. కానీ సామాన్య హిందూ సమాజం ఇలాంటి దాడులను ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాన్సువాడలో అమాయకులైన హిందూ యువకులను అరెస్టు చేసి జైల్లో పెడితే వారి కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు.

## స్వగ్రామంలో విజయ్, రష్మిక దంపతుల సందడి

(మొదటిపేజీ తరువాయి)

గ్రామస్తులు నూతన వధూవరులకు తెలంగాణ సంప్రదాయ పద్ధతుల్లో డప్పు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు.

**సత్యనారాయణ వ్రతం చేసిన విజయ్, రష్మిక దంపతులు**

అంతకుముందు ఫామ్ హౌస్‌లో నూతనంగా నిర్మించిన ఇంట్లోకి గృహ ప్రవేశం చేసి, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరందరికీ పెళ్లి విందు ఇచ్చారు. సినీ పరిశ్రమలో రాణిస్తూ రౌడీబాయ్‌గా గుర్తింపుతెచ్చుకున్న విజయ్ మూలాలు మరిచిపోకుండా సొంతూరికి రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొంతూరితో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న విజయ్ దేవరకొండ భావోద్వేగానికి గురయ్యారు. ఇక నుంచి తరుచూ ఊరొస్తామన్న ఆయన దేవరకొండ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తామని ప్రకటించారు.

**స్కాలర్ షిప్ లు ఇస్తాం**

"సొంత ఊరిలో అందరికీ భోజనాలు పెట్టాలనేది మా నాన్న కోరిక. నా ఫస్ట్ బర్త్‌డేను తుమ్మంపేటలోనే జరుపుకున్నాం. ఈ ఏడాది నుంచి అచ్చంపేట డివిజన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తాం. 9, 10 తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకర్లకు స్కాలర్‌షిప్‌లు ఇస్తాం" అని విజయ్ దేవరకొండ ప్రకటించారు. విజయ్, రష్మికతో కలిసి ఫామ్ హౌస్‌లో దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ నెల 4న హైదరాబాద్‌లో జరిగే గ్రాండ్ రిసెప్షన్ వేడుకకు ఇప్పటికే ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ తారలను విరోష్ జంట ఆహ్వానించింది.


# ఇరాన్‌తో దీర్ఘకాలిక యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడులు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు కనీసం 555 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 131 నగరాలు దాడులకు గురయ్యాయని ఆ సంస్థ తెలిపింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. సంయుక్తంగా అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌లో కీలక సైనిక, వ్యూహాత్మక లక్ష్యాలపై కచ్చితమైన వైమానిక దాడులు జరుపుతున్నాయని సమాచారం. మరోవైపు ఇరాన్ కూడా ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటోంది. ఈ క్రమంలో కువైట్‌లోని అమెరికా రాయబారి కార్యాలయ సముదాయంపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి.

**విస్తరిస్తున్న యుద్ధం**

యుద్ధం ఇరాన్‌కే పరిమితం కాకుండా ప్రాంతీయంగా విస్తరిస్తోంది. దక్షిణ లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. అక్కడ కనీసం 31 మంది మరణించినట్లు సమాచారం. ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా రాకెట్లు, డ్రోన్లతో ప్రతిదాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం ఇంకా ఎన్నో రోజులపాటు యుద్ధం కొనసాగొచ్చని హెచ్చరించింది. అమెరికా బలగాలు కూడా ఈ యుద్ధంలో నేరుగా పాల్గొంటున్నాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం, తాజా ఘర్షణల్లో ముగ్గురు అమెరికా సైనికులు మరణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన సైనిక చర్యల్లో ఒకటిగా అభివర్ణించారు. లక్ష్యాలు నెరవేరే వరకు దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు, ఇరాన్ మాత్రం చర్చలకు తావులేదని ప్రకటించింది. అమెరికాతో ఎలాంటి చర్చలు జరపబోమని ఇరాన్ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రకటనలతో దౌత్యపరమైన పరిష్కారం దూరమవుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ప్రభావం చూపుతోంది. సూయిజ్ కెనాల్ మార్గంలో నౌకాయానాన్ని కొన్ని సంస్థలు నిలిపివేశాయి. పలు పశ్చిమాసియా దేశాల్లో గగనతలాన్ని మూసివేయడంతో వేలాది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన స్ట్రయిట్ ఆఫ్ హార్మూజ్ వద్ద ఉద్రిక్తతలు పెరగడంతో ఆయిల్ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. మొత్తంగా చూస్తే, అమెరికా- ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలు, ప్రాంతీయ మిలీషియా దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. ప్రాణ నష్టం పెరుగుతుండగా, అణు కేంద్రాల భద్రతపై ప్రపంచం ఆందోళన చెందుతోంది.



## ఇరాన్ సుప్రీం ఖమేనీ భార్య 'మన్సూరే' మృతి

**మహా:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే మృతి చెందినట్లు సమాచారం. ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిగిన నేపథ్యంలో ఖమేనీ కుటుంబ సభ్యులు కూడా ప్రభావితమైనట్లు తెలుస్తోంది. ఆ దాడుల్లో ఖమేనీ భార్య తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు సమాచారం. అయితే మన్సూరే మృతిపై ఇరాన్ ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## ఖమ్మం వర్సెస్ కేరళ

- కాంగ్రెస్ వస్తే పేదల ఇళ్ళు కూలుతాయని విజయన్ ట్వీట్
- మంత్రి పొంగులేటి కౌంటర్

**మహా:** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల ఇళ్ళుకూలుతాయని, ఇందుకు ఖమ్మం వెలుగుమట్ల కూల్చివేతలే నిదర్శనమంటూ కేరళ సీఎం విజయన్ ట్వీట్ చేయగా, దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా యంత్రాంగం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పందిస్తూ, ఈ వ్యవహారంలో రాజకీయ లబ్ధి కోసం కేరళ కాంగ్రెస్‌ను లాగడం సరికాదని పేర్కొన్నారు.



## కేసీఆర్‌ను కలిసిన ఎంజీఆర్

హైదరాబాద్, మహా: బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి సోమవారం రాత్రి కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రాబోతున్నదని, అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం ప్రజలతో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. త్వరలో రానున్న జీహెచ్ఎంసి ఎన్నికలకు కూడా సన్నద్ధం కావాలని సూచించారు.

## ఉద్యోగాలేవి?

**జాబ్ క్యాలెండర్ ఎక్కడ?.. రాహుల్ గాంధీకి కవిత ప్రశ్నాస్త్రాలు**

**హైదరాబాద్, మహా :** రాహుల్ గాంధీ తెలంగణ రాషఅట్ర పర్యటన సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన అధికారిక ఎక్స్ ఖాతాలో తీవ్ర విమర్శలు చేశారు. "రాహుల్ గాంధీ జీ దో లాక్ నౌకరీ దో... కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మీరు హామీ ఇచ్చి రెండున్నరేళ్లు అయ్యింది. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ గారు... మీ హామీని నమ్మి శిక్ష అనుభవిస్తున్న మా నిరుద్యోగుల గోడు మీకు పట్టదా?" అని ప్రశ్నించారు. "మీ పార్టీ గద్దెనెక్కడానికి నిచ్చెనమెట్లుగా నిలిచిన యువత ఆశలు చిదిమేశారు. ఉద్యోగాలు అడిగితే పోలీసులతో అణచివేస్తున్నారు. యూత్ డిక్లరేషన్ బోగస్‌గా మారింది. జాబ్ క్యాలెండర్ పత్తా లేదు. కాంగ్రెస్ అంటేనే మోసం, వంచన అనే మాటను నిలబెట్టుకున్నారు. రాహుల్ జీ, ఇది పోరాటాల పురిటిగడ్డ... 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని అమలు చేయించండి" అని కవిత తన ట్వీట్‌లో కోరారు.



## ఇరాన్ దాడులను ఖండించిన ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయిన వారికి సంతాపాన్ని ప్రకటించారు. ఈ కష్టకాలంలో యూఏఈకి అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రవాస భారతీయుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నందుకు యూఏఈ ప్రెసిడెంట్‌కు ధన్యవాదాలు తెలిపారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలని, ప్రాంతీయ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రధాని పిలుపునిచ్చారు.

**అందుకే ఆ దాడులను ఖండించాం...**

"పశ్చిమాసియా ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై బహ్రయిన్ రాజు, సౌదీ యువరాజులతో చర్చించాను. ఆ రెండు దేశాలపై ఇటీవలే ఇరాన్ చేసిన దాడులను ఖండించాను. ఈవిధంగా దాడులు చేయడం అనేది ఇతర దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు భంగం కలిగించినట్లు అవుతుంది. అందుకే ఆ దాడులను భారత్ ఖండించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రవాస భారతీయుల యోగ, క్షేమాలను పర్యవేక్షిస్తున్నందుకు బహ్రయిన్ రాజు, సౌదీ యువరాజులకు ధన్యవాదాలు చెప్పాను" అని పేర్కొంటూ ప్రధాని మోదీ ఒక ట్వీట్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కారించాలి



**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి భువనగిరి, మహా: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 62 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 37,గ్రామీణాభివృద్ధి శాఖ 7,మున్సిపాలిటీ 5,హౌసింగ్ 4, ఎం .పి. డి.ఓ 2, పంచాయతీ 2,జిల్లా పరిషత్ ,ఎలక్ట్రిసిట్ ,అటవీ శాఖ ,విద్య శాఖ, ఆర్.టి.సి , శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.స్టేట్ ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ,జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మూడు అమెరికా యుద్ధ విమానాలను కూల్చిన కువైట్

**మహా:** కువైట్ గగనతలంలో అమెరికా యుద్ధవిమానాల ప్రమాదం కలకలం రేపింది. మిత్ర దేశాల మధ్య సమన్వయం లోపం వల్లే ఆ ఘటన చోటుచేసుకున్నట్టుగా తెలిసింది. సోమవారం ఉదయం మూడు అమెరికా ఫైటర్ జెట్లను కువైట్ వైమానిక రక్షణ దళాలు పొరపాటున కాల్చివేసినట్లు పెంటగాన్ వెల్లడించింది. దీనిని ఫ్రెండ్లీ ఫైర్ ఘటనగా అభివర్ణించింది. ప్రమాదానికి గురైన మూడు ఎఫ్15 యుద్ధ విమానాల్లో ఉన్న ఆరుగురు సిబ్బంది సమయానికి ఎజెక్ట్ కావడంతో ప్రాణాపాయం తప్పిందని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ప్రస్తుతం వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం కూడా అధికారిక ప్రకటన విడుదల చేసింది. సోమవారం ఉదయం పలు అమెరికా సైనిక విమానాలు కూలిపోయాయని కువైట్ రక్షణ శాఖ ధ్రువీకరించింది. వెంటనే శోధన, రక్షణ చర్యలు చేపట్టి సిబ్బందిని ఆసుపత్రులకు తరలించామని తెలిపింది. అమెరికా బలగాలతో నేరుగా సమన్వయం చేసుకుని ఘటనకు గల కారణాలపై సంయుక్త దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది.

# పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం

**తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్**

**ఆదేశించిన సీఎం రేవంత్, ఏర్పాటు చేసిన అధికారులు**

**న్యూఢిల్లీ, మహా :** మధ్యప్రాచ్యంలో(పశ్చిమాసియా) నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం (పశ్చిమాసియా) ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24x7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.



**24×7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు ఇవే...**

- వందన బరువా (పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్ & లైజన్ హెడ్): +91 9871999044
- సీహెచ్. చక్రవర్తి (పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్): +91 9958322143
- జావేద్ హుస్సేన్ (లైజన్ ఆఫీసర్): 9910014749
- రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్): +91 9643723157..

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఎఫెక్ట్

**దుబాయ్‌లో చిక్కుకుపోయిన మంత్రి తుమ్మల**

**క్షేమంగా ఉన్నట్లు సమాచారం**

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరు అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. ట్రీట్‌మెంట్ అనంతరం తిరిగి ఇండియాకు రావాలని భావిస్తున్న తరుణంలోనే పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చింది. దీంతో మంత్రి ప్రయాణానికి ఆటంకం ఏర్పడి అక్కడే చిక్కుకుపోయారు. ప్రస్తుతం ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న దాడుల ప్రభావం దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుపై పడింది. ఆదివారం దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లోని టెర్మినల్ 3 సమీపంలో క్షిపణి దాడులు జరగడంతో భద్రతా కారణాల దృష్ట్యా అక్కడి ప్రభుత్వం విమాన రాకపోకలను పూర్తిగా నిలిపివేసింది. దీని కారణంగా వేలాది మంది ప్రయాణికులతో పాటు మంత్రి తుమ్మల కుటుంబంతో సహా దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు.

## ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకై ఎంఆర్పిఎస్ మరో పోరాటం



**ఆలేరు, మహా:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి తక్షణమే 12 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని...అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాలసాగు భూమిని కేటాయించాలని ఎంఆర్పిఎస్ (పాపయ్య మాదిగ ) ఆద్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు...ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాఆలేరులో మార్చి 9 జిల్లా కలెక్టర్లుకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని మెమొరడం ఇవ్వాలని ,మార్చి 27 న నిరాహారదీక్షలు జయప్రదం చేయాలనే ఎం ఆర్ పి ఎస్ కరపత్రంను ఆవిష్కరించారు...

## బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

**మంచిర్యాల, మహా :** బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి ఘటనలో ఆయనతో పాటు మరో ముగ్గురికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం క్యాతనపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిబ్రవరి 18న మంత్రి వివేక్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టయ్యారు. ప్రస్తుతం బాల్క సుమన్ ఆదిలాబాద్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు ఆయనకు రూ.25 వేల పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ మంది విజయం సాధించారు. దీంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక పలుమార్లు వాయిదాపడిన నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తాయి.

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | 03-03-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM



## బండారి అనూష సతీష్ కు మున్నూరు కాపుల ఆత్మీయ సత్కారం



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మన ఇంటి బిడ్డేనని, మన నియోజకవర్గ బిడ్డే అని బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ఆడె గజేందర్ అన్నారు.సోమవారం బజార్ హత్నూర్ మండలంలోని దెహగాం గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి చేరుకున్న బండారి అనూష సతీష్ ఆదిలాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. అటు తనకు అభినందన సభ ఏర్పాటు చేసినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మున్నూరు కాపు కుల బాంధవులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ , బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్, సర్పంచ్ లు తొడసం నాందేవ్, రజాక్, కళ్యెం విఠల్,పోరెడ్డి నారాయణ,నరేష్,దేవన్న, శివుడు, సయ్యద్ సల్మాన్, సూర్యవంశీ పాండురంగ్,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి- బండారి అనూష




**ఆదిలాబాద్ మహా:** మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కమ్యూనిటీ హాల్ జన్ శిక్షన్ సంస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ద్వారా వివిధ రంగాలలో శిక్షణ పొందిన యువతులు మహిళలకు ఆమె సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. మహిళలు ప్రస్తుతం శిక్షణ తీసుకున్న టైలరింగ్ , ఎంబ్రాయిడరీ , బ్యూటీ పార్లర్ అంశాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. వారు నేర్చుకున్న రంగాలలో రాణించి ఆర్థికంగా ఎదగాలన్నారు.మంచి శిక్షణ అందించిన సంస్థ ను ఆమె అభినందించారు.చైర్ పర్సన్ దంపతులను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది , కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎండబ్ల్యూఎస్ కమిషనర్‌తో బొంతు శ్రీదేవి యాదవ్ సమావేశం



**కుషాయిగూడ, మహా :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్) కమిషనర్ అశోక్ రెడ్డితో బొంతు శ్రీదేవి యాదవ్ సమావేశమయ్యారు. గతంలో కార్పొరేటర్‌గా, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్న సమయంలో అత్యవసర పనుల కోసం సమర్పించిన వినతిపత్రంపై చర్చించారు. నాగార్జున నగర్ మెయిన్ రోడ్‌కు రూ.25 లక్షలు, చక్రిపురం లలితా వైన్స్ ప్రాంతానికి రూ.30 లక్షలు, విద్యా మారుతి నగర్‌కు రూ.21.30 లక్షలు, చర్లపల్లికి రూ.13 లక్షలు, బీఎన్ రెడ్డి నగర్‌కు రూ.3.60 లక్షలు, భారత్ నగర్‌కు రూ.4.90 లక్షలు, లక్ష్మీ నగర్‌కు రూ.31 లక్షల విలువైన పనులు గత వారం ఆమోదం పొందినట్లు కమిషనర్ తెలిపారు. వీటి అమలు కోసం వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పనులు ప్రారంభించాలంటూ బొంతు శ్రీదేవి యాదవ్ కోరారు. అదేవిధంగా కుషాయిగూడ, కృష్ణారెడ్డి నగర్, మీనాక్షి నగర్, శుభోదయ కాలనీ, నేతాజీ నగర్, డాక్టర్స్ కాలనీ, ఫుకెట్ నగర్, హనుమాన్ కాలనీ, లోకమాత కాలనీలలో దెబ్బతిన్న యూజీడీ మార్పిడి పనులకు రూ.172.10 లక్షలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన కార్పొరేటర్ల ప్రత్యేక నిధి రూ.40 లక్షలతో సాయి కృష్ణ ఎంక్లేవ్, కుషాయిగూడ, మీనాక్షి నగర్, శుభోదయ కాలనీలలో వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని కమిషనర్ వెల్లడించారు.

## అసమానతలు రూపుమాపి... సమాన హక్కులకై ఉద్యమించాలి

**పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి**

**కుషాయిగూడ, మహా :** సమాజంలో అసమానతలు రూపుమాపినప్పుడే మహిళలకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, శ్రామిక మహిళల ఉపాధిపై దాడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్ నగర్ పరిధిలోని ప్రగతినగర్ రామచంద్రయ్య భవన్లో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయమహిళా దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యమాలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, హింసలను ప్రశ్నిస్తూ పోరుగీతమై ప్రపంచాన్ని కుదిపేసే చరిత్ర ఉందని గుర్తు చేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వాల్ పోస్టర్ను ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయసుధ, వెంకటమ్మ, రేణుక. పుణ్యవతి, ఫాతిమా, శివబాబు తదితరులు పాల్గొన్నారు

## శ్రీపాదరావు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డి విజేందర్ రెడ్డిఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ (ఇంఛార్జి) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రావిచేడ్ వీధుల్లో రథోత్సవ వైభవం..

**గోవింద నామస్మరణతో మార్మోగిన గ్రామం!**



**ఆమనగల్లు, మహా :**కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసా గుతున్నాయి. ఆదివారం రాత్రి స్వామి వారి రథోత్సవం కనువపండువగా కొనసాగింది. వేదపండితులు తిరుమల వింజమూరి రామానుజాచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన రథంపైఉత్సవమూర్తులను ఊరేగించారు. వెంకటేశ్వర స్వామి నామస్మరణతో భక్తులు ఇరువైపులా రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు రవికుమార్, భూపతి, మాజీ ఎంపీటీసీలు యాదయ్య, రంగయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాకార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు తో కలిసి అర్జీదారుల నుండి ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన గజెల్లి నర్సయ్య తన భూమిలోకి కొందరు అక్రమంగా చొరబడి బోర్ వేశారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కాసిపాక విజయ్ కుమార్, బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన దాగం చరణ్ తాము తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని పోరాడామని, తమ పేర్లను ఉద్యమకారుల జాబితాలో నమోదు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్ రార్ తమ తాత ముత్తాతలకు చెందిన షెత్ సింధీ భూములను అన్యాక్రాంతం కాకుండా తమకు వర్తించే విధంగా న్యాయ సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చునార్కర్ తారాబాయి, చునార్కర్ శ్యాంరావు తాము సంవత్సరాలుగా కాస్తు, కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూమికి నూతన పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన బొద్దుల స్వప్న దివ్యాంగురాలు తనకు ప్రభుత్వ పథకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన పోలికోట సుజిత్ నిరుపేద ట్రాన్స్ జెండర్ అయిన తనకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. డీ మార్కేషన్, జాతీయ రహదారుల విస్తరణలో అవార్డు పెంచాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ భూముల కబ్జాలు, బఫర్ జోన్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి చర్యలు తీసుకోవాలని, అంత్యోదయ కార్డు మంజూరు కొరకు ఇతర అంశాలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి**

దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే, స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంథని నియోజకవర్గ శాసనసభ్యులుగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. మంథని ప్రాంత అభివృద్ధిపై విశేష కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా గొప్ప అవకాశం కల్పించింది




- **కన్న ఊరు లాగే కరీంనగర్ ను మర్చిపోలేను..**
- **అధికారుల సహకారంతోనే జిల్లా సమగ్ర అభివృద్ధికి శక్తియుక్తుల కృషి చేశా..**
- **వీడ్కోలు సమావేశంలో పూర్వ కలెక్టర్ పమేలా సత్పతి**
- **జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఘన సన్మానం..**

**కరీంనగర్ మహా :** జిల్లా కలెక్టర్గా అభివృద్ధి చేసే గొప్ప అవకాశాన్ని కరీంనగర్ ఇచ్చిందనికన్న ఊరు లాగా ప్రజలంతా అక్కున చేర్చుకోవడం జీవితంలో మర్చిపోలేనని కరీంనగర్ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కరీంనగర్ లోని జింకల పార్కులో సోమవారం రాత్రి జిల్లా అధికారుల ఆధ్వర్యంలో కరీంనగర్ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల జిల్లా అధికారులు టీఎన్జీవో టీజీవో తాసిల్దారులు ఎంపీడీవోలు అధికారులందరూ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భావద్వేగ పూరితంగా ప్రసంగించారు. రెండు సంవత్సరాల నాలుగు నెలలపాటు కరీంనగర్ జిల్లా కలెక్టర్గా పనిచేయడం గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. జిల్లా అధికారులు అధికారులు కిందిస్థాయి సిబ్బంది సహకారంతో తన శాయశక్తుల సమగ్ర అభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. ఇందులో అందరి సహకారం ఎల్లవేళలా మరువలేనని పేర్కొన్నారు. కన్న ఊరు కోరాపుట్ తర్వాత జీవితంలో ఎప్పటికీ కరీంనగర్ జిల్లాను మరిచిపోలేని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కన్న తల్లి లాగా అక్కున చేర్చుకుందని తెలిపారు. జిల్లాలో ఎన్నో నేర్చుకుందామని జిల్లా ఎంతో నేర్పిందని చెప్పారు. అన్ని రంగాల్లో జిల్లాను సమగ్ర అభివృద్ధికి పాటుపడామని తెలిపారు. సిపి గౌష్ ఆలం ఓ పాటు జిల్లా అధికారులు అందరూ అభివృద్ధిలో తన వంతు సహకారం అందించారని వారి సహకారంతోనే జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపి గౌష్ ఆలం అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే లక్ష్మికిరణ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు అన్ని విభాగాల జిల్లా అధికారులు టీఎన్జీవో టీజీవో సంఘాల ప్రతినిధులు ఎంపీడీవోలు తహసీల్దారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

### టీచర్ల వేతనాలపై విద్యా కమిషన్ సిఫారసులు
## ఉపసంహరించాలి: టిపిటిఎఫ్



**కుషాయిగూడ, మహా :** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి ఆధ్వర్యంలో సమర్పించిన నివేదిక అశాస్త్రీయంగా, అనాలోచితంగా ఉందని టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి విమర్శించారు. ఈ సిఫారసులు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీన పరచి, ప్రైవేటు మరియు కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే ఈ సిఫారసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టడం, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచడం, కార్మికుల వేతనాలు పెంచడం, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు - ఒక గది విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించడం స్వాగతించదగ్గ అంశాలేనని తెలిపారు. అయితే ఉపాధ్యాయుల జీతభత్యాల అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించి ఉపాధ్యాయ వర్గంపై అక్కసు వెళ్లగక్కడం తీవ్రంగా వ్యతిరేకించదగ్గ విషయమన్నారు. ఇప్పటికే ఐదు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 2023 జూలై నుండి రావాల్సిన పీఆర్సీ అమలుపై స్పష్టత లేదని గుర్తుచేశారు. కమిషన్ సిఫారసులు ప్రభుత్వం పీఆర్సీని ఎత్తివేసే దిశగా ఆలోచించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కొన్ని కోర్సులను రద్దు చేయాలని, ప్రవేశ పరీక్షలకు ఇంటర్మీడియట్ మార్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించడం బాధాకరమన్నారు. విద్యా, మానసిక, వైజ్ఞానిక నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు పీజీ అర్హత తప్పనిసరి చేయాలని సూచించడం శోచనీయమన్నారు. దీనివల్ల అభ్యర్థుల వయస్సు పెరగడం తప్ప ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో బోధన నాణ్యత మెరుగుపర్చేందుకు శిక్షణ, భాషా పట్టు, బోధనా విధానాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత అర్హతలు విధించడం ద్వారా వివక్ష పెరిగే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 వేల ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, కేవలం 2000 పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన అశాస్త్రీయమన్నారు. మండలానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఒకే చోట 1500 మంది విద్యార్థులను సమీకరించడం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తుందని తెలిపారు. ఈ విధానం బడి-ఊరు అనుబంధాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇంటర్మీడియట్ మార్కులకు మాత్రమే ప్రాముఖ్యత ఇవ్వడం కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభం చేకూర్చడమే అవుతుందన్నారు. ఇది పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే పరిస్థితిని సృష్టించవచ్చని హెచ్చరించారు. అందువల్ల ప్రభుత్వం విద్యా కమిషన్ సిఫారసులను వెంటనే ఉపసంహరించుకుని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి అందరికీ సమాన, నాణ్యమైన, గుణాత్మక విద్య అందించే కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ సూచనలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగ, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహణ...

**ఎస్ఎఫ్ఐ నాయకులు,కే వై, ప్రణయ్**



**రాజేంద్రనగర్, మహా ;** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శంషాబాద్ లో టాలెంట్ టెస్ట్ ను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పేపర్ ను ఎస్సై అశోక్ వర్మ సార్,బుచ్చిరెడ్డి , జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్, భార్గవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్ మాట్లాడుతూ పదవ తరగతి బోర్డ్ ఎగ్జామ్ రాయబోతున్న విద్యార్థులకు భయానికి లోను కాకుండా ధైర్యం నింపే విధంగా ఈ పరీక్ష నిర్వహించామన్నారు . విద్యార్థులలో ఉన్న టాలెంట్ ను భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుంది. ఎస్ఎఫ్ఐ అంటే ఎప్పుడు పోరాటాలే కాదు విద్యార్థులు చదువు తో పాటు అన్ని రంగాలలో ముందుండే విధంగా కృషి చేస్తుందన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ కు వివిధ పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అకాడమీ ఉపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ నాయకులు చందు గౌడ్,తరుణ్, చరణ్, సతీష్, తనిష్క, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలి

**గ్రామపంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ తరగతులో.... ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలంలోని పలు గ్రామాలలో వార్డు సభ్యులుగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు సోమవారం శంషాబాద్ జడ్పీ హెచ్ఎస్ స్కూల్లో మండల అధికారులు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ ఓ రమేష్ , ఎంపీడీవో మున్ని, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర క్రియాశీలకంగా ఉంటుందన్నారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి సభ్యునికి అందేలా వార్డు సభ్యులు చొరవ చూపాలి. సంక్షేమ పథకాలతో పాటు గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులు తమ గ్రామ సర్పంచ్కి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ముఖ్యమన్నారు. వార్డు సభ్యులుగా రాజకీయాలలో నిలదొక్కుకొని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మండలంలోని వార్డు సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హరిచరణ్ గౌడ్ ని పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బుద్వేల్‌కు చెందిన వ్యాపారవేత హరిచరణ్ గౌడ్‌ను మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్ ఆయన నివాసంలో సోమవారం పరామర్శించారు.కొన్ని రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్ పోర్టులో కాలు జారీ క్రింద పడిపోవడంతో కాలికి బలమైన గాయమైంది. నొప్పితో బాధపడుతున్న హరి చరణ్ గౌడ్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలన్నారు.

## పలు హోటల్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు

**నిలువ ఉంచిన ఆహారంతో పాటు మాంసాన్ని ల్యాబ్ కు తరలింపు...**



**రాజేంద్రనగర్, మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పలు హోటల్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హైదర్ గూడాలోనిగోల్డెన్ ప్యాలెస్, స్టార్ హోటల్ లను జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారి సౌమ్య రెడ్డి తో కలిసి డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వండిన ఆహార పదార్థాలతో పాటు మాంసాన్ని ఫ్రిడ్జ్ లలో నిల్వ ఉంచడంపై ఫుడ్ సేఫ్టీ అధికారి సౌమ్య రెడ్డి హోటల్ నిర్వాహకులపై ఫైర్ అయ్యారు. హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. హోటల్స్ లో కిచెన్ రూమ్ లో శుభ్రంగా ఉంచాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను మాంసాన్ని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ కు తరలించారు. వండిన ఆరపదార్థాలతో పాటు మాంసాన్ని ఫ్రిడ్జ్ లలో నిల్వ ఉంచరాదు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చాక తదుపరి చర్యలు ఉంటాయని సౌమ్య రెడ్డి తెలిపారు.

## ఘనంగా 102 హోమ్ మిషన్ వేడుకలు

**క్రైస్తవ సోదరులందరికీ ఎల్లవేళలా అండగా ఉంటా.. ఎంపీ మల్లురవి**



**ఆమనగల్లు, మహా :**నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని క్రైస్తవ సోదరులందరికీ ఎల్లవేళలా ఉండి తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.సోమవారం ఆకుతోటపల్లి గ్రామంలో 102 హోమ్ మిషన్ సెలబ్రేషన్స్,రెవరెండ్ జి సి కృపయ్య మెమోరియల్ వింగ్ చర్చి ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి,ఎంబిజిసి అధ్యక్షులు ఐపి ఆశీర్వాదం, జిసి ప్రధాన కార్యదర్శి జీకే రూపస్,పాస్టర్ వరప్రసాద్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ఆకుతోటపల్లి గ్రామంలో 102 సంవత్సరాలు క్రిందట ఎంబి మిషన్ ప్రారంభం కావడం గొప్ప విశేషమన్నారు . నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో దాదాపు సంఘాలు పెద్దవి ఉన్నాయని తెలిపారు.ఆ సంఘాలన్నిటికీ ఒక ప్రధాన పాస్టర్ గా ప్రజలు నాకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. వాటన్నిటిని కాపడం కోసం ఎప్పుడు ముందుంటానని తెలిపారు.

## నిబంధనలను అతిక్రమించి నడుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లను సీచ్ చేసిన రెవెన్యూ అధికారులు




**రాజేంద్రనగర్ మహా ;** నిబంధనలు అతిక్రమించి నడుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు. శంషాబాద్ జోన్ పరిధిలోని కోత్వాల్ గుడా రెవెన్యూ పరిధిలో వెలిసిన అక్రమ రెడీమిక్స్ ప్లాంట్లను మండల తాసిల్దార్ రవీందర్ దత్, విజిలెన్స్ అధికారుల ఆదేశాలతో రెవెన్యూ అధికారి కృష్ణ తన సిబ్బందితో కలిసి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లకు నోటీసులు జారీ చేసి సోమవారం సీజ్ చేశారు. అక్రమంగా నడిపిస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లను సీజ్ చేశామన్నారు.

# ఆ ఏడుగురు ఎక్కడ..?



- దామరపల్లి నర్సింహారెడ్డి,
రచయిత కవి

## ఆపరేషన్ కగార్ తరువాత మావోయిస్టు ఉద్యమంలో కొత్త మలుపు..

(మహా ప్రత్యేకం)

తెలంగాణలో ఒకప్పుడు ఉవ్వెత్తున ఎగిసిపడ్డ నక్సల్బరి స్ఫూర్తి విప్లవోద్యమం, వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, అరెస్టులతో క్రమంగా క్షీణిస్తోంది. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు విస్తరించింది. ఆ తర్వాత సిపిఐ (మావోయిస్టు) రూపంలో కొనసాగిన ఈ ఉద్యమం ప్రస్తుతం సంక్షోభ దశను ఎదుర్కొంటోంది.



### ఆపరేషన్ కగార్ ప్రభావం

ఇటీవలి కాలంలో అమలు చేసిన “ఆపరేషన్ కగార్”తో మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బ తగిలిందని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. పలువురు కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోగా, మరికొందరు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖ నాయకులు ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. లొంగిపోయిన వారిలో మల్లా రాజిరెడ్డి (దేవ్‌జీ), బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు. వీరు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చింది.

### అదృశ్యమైన ముగ్గురు

అయితే, ఆపరేషన్ కగార్ తరువాత కూడా తెలంగాణకు చెందిన కొందరు మావోయిస్టుల ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది.సిద్దిపేట జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన రంగబోయిన భాగ్య అలియాస్ రూపి - ఉత్తర బస్తర్ ప్రాంతంలో ఏరియా కమాండర్‌గా ఉన్నట్లు సమాచారం. అక్కన్నపేటకు చెందిన కాశబోయిన స్వరూప - 25 ఏళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లింది. నంగునూరు ప్రాంతానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క - దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో సభ్యురాలిగా పనిచేసినట్లు సమాచారం. వీరు అడవిలో ఉన్నారా? లొంగిపోయారా? ఎన్‌కౌంటర్లలో మరణించారా? అన్నది స్పష్టత లేకుండా ఉంది. కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

### దండకారణ్యంలో పరిస్థితి

దండకారణ్యం ప్రాంతం మావోయిస్టుల ప్రధాన స్థావరంగా గుర్తింపు పొందింది. అక్కడి ఆదివాసులు సంవత్సరాలుగా ఈ ఉద్యమంతో ముడిపడి ఉన్నారు. భద్రతా దళాల చర్యలు పెరగడంతో అనేక గ్రామాలు ఖాళీ అవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. వలసలు కూడా పెరిగినట్లు సమాచారం. నాటి పీపుల్స్ వార్, జనశక్తి దళాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అనేక మంది కీలక నేతలు ఉన్నారు. కాలక్రమేణా వారు ఎన్‌కౌంటర్లలో మరణించగా, మరికొందరు లొంగిపోయారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి సుమారు 11 మంది మాత్రమే మావోయిస్టు పార్టీలో ఉన్నారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

### జైళ్లలో మగ్గుతూ

చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జైళ్లలో వందల సంఖ్యలో మావోయిస్టు కేసులతో వ్యక్తులు నిర్బంధంలో ఉన్నారు. కొందరు విచారణ ఖైదీలుగా సంవత్సరాలుగా జైల్లోనే ఉన్నారు. కేంద్ర హోం శాఖ పునరావాస విధానాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

### సిద్ధాంత సంక్షోభం

మాజీ మావోయిస్టు సిద్ధాంతకర్త మల్లోజుల వేణుగోపాల్ (సోను దాదా) వ్యాఖ్యల ప్రకారం, సిద్ధాంతపరమైన పొరపాట్లు, వ్యూహపరమైన తప్పిదాలు పార్టీ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయేలా చేశాయి. దేశంలో కమ్యూనిజం శతాబ్ద కాల ప్రయాణం చేసినప్పటికీ, నేటి వామపక్షాలు సంక్షోభంలో ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత తరంలో ఉద్యమాల పట్ల ఆసక్తి తగ్గిందని విశ్లేషకులు చెబుతున్నారు. నిరుద్యోగం, వలసలు, మత్తు పదార్థాల వ్యసనాలు వంటి సమస్యలు యువతను ఇతర దారుల్లోకి మళ్లిస్తున్నాయనే ఆందోళనలు ఉన్నాయి.

### అధ్యాయం ముగిసిందా? పుట్టుకొస్తుందా?

మావోయిస్టు ఉద్యమం పూర్తిగా ముగిసిందా? లేక కొత్త రూపంలో మళ్లీ పుట్టుకొస్తుందా? పీడిత వర్గాలు ఉన్నంతవరకు ప్రతిఘటన రూపాలు మారుతాయే గానీ అంతరించవని కొందరి అభిప్రాయం. అదృశ్యమైన మావోయిస్టుల ఆచూకీపై స్పష్టత రాకపోవడం కుటుంబాల్లో ఆవేదనను పెంచుతోంది. వారు సురక్షితంగా ఉన్నారనే సమాచారం లభిస్తే కుటుంబాలకు ఉపశమనం కలుగుతుంది. ప్రస్తుతం ఉద్యమం సంక్షోభ దశలో ఉన్నప్పటికీ, దాని ప్రభావం, దాని చరిత్ర, దాని మిగిలిన ప్రశ్నలు ఇంకా సమాధానాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. వరంగల్ జిల్లాకు చెందిన సంధ్యారెడ్డి గత 40 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలోకి వెళ్లారు ఇంతవరకు ఆమె జాడ తెలియడం లేదు. సినీ రచయిత కాకరాల కుమార్తె దుర్గ జాడ తెలియడం లేదు. దుర్గ పటేల్ సుధాకర్ రెడ్డి సహచరి. కాకరాల మరో కుమార్తె సునీత పోలీసులకు లొంగిపోయింది. సునీత శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్ సహచరి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన తుమ్మల పల్లి శ్రీనివాస్ అలియాస్ విశ్వనాథ్ సిపిఐ ఎంఎల్ జనశక్తి పార్టీలోకి గత 28 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇంతవరకు అచూకీ లేదు. తల్లిదండ్రులు చనిపోయిన కడసారి చూపుకై తుమ్మల పల్లి శ్రీనివాస్ రాలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బండి చంద్రం అలియాస్ మహేష్ 28 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలోకి వెళ్లిపోయారు ఇంతవరకు అచూకీ లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన బత్తుల కాంతారావు అలియాస్ నవీన్ గత 30 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలోకి వెళ్లిపోయారు. దండకారణ్యం నుండి ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ కు బదిలీపై వెళ్లారు ఇంతవరకు వందల సంఖ్యలో మావోయిస్టులు లొంగుబాట్లు ఎన్కౌంటర్ లు జరిగినా వీరు ముగ్గురి అచూకీ తెలియడం లేదు. కుటుంబ సభ్యులు వారిని స్మరించుకుంటూ కన్నీరు పెడుతున్నారు ఎక్కడ ఉన్న కొడుకుల్లారా ఈ ఇంటికి రండి అంటూ తల్లిదండ్రులు ప్రాధాయపడుతున్నారు. పోలీసులను అడిగితే తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని సమాచారం ఇస్తున్నారు. సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్ పార్టీ సిపిఐ ఎంఎల్ జనశక్తి పార్టీలు పురుడు పోసుకున్న వేళల్లో ఎంతోమంది యువకులు మిస్సింగ్ అయ్యారు వారి జాడలు తెలియడం లేదు. దగ్గు రాజలింగం మిస్సింగ్ గాను ఉంది










## జీ సినీ అవార్డ్స్ 2026లో

# మెరిసిన బాలీవుడ్ తారలు











## ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలి

- ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి
- హోలీ సందర్భంగా వైన్స్ లు బార్లు బంద్
- కమిషనర్ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుపుకునే హోలీ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకునేలా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖ అధికారులకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వైన్స్ లు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు మంగళవారం ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు మూసి వేయబడతాయని వెల్లడించారు. సిపి ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా హోలీ పండుగను జరుపుకోవాలని భావించి, తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం ఈ నిర్ణయం తీసుకోబడింది. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయి.

## ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం..

**మణుగూరులో 14 మంది లబ్ధిదారులకు అందజేత..**



**మణుగూరు, మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలానికి చెందిన 14 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. మణుగూరు పట్టణంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. పేదలకు గృహ వసతి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలవుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లభించడం ద్వారా లబ్ధిదారుల కుటుంబాలకు స్థిర నివాసం కలగడంతో పాటు వారి జీవన స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో పల్నాటి వెంకటేశ్వర్లు, డీటీ రామారావు, హౌసింగ్ ఏఈ సంతోష్ కుమార్, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, 14 టైర్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, గుట్ట మల్లారం సర్పంచ్ కారం పూజిత, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, సాంబాయిగూడెం సర్పంచ్ చీడెం ఉషారాణి, ఉప సర్పంచ్ పులిగిల్ల రమేష్, వార్డు సభ్యులతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోలమూరి రాజు, రామ్ రెడ్డి, గుండగాని నాగేశ్వరావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వేగంగా మణుగూరు–బీటీపీఎస్ ప్రధాన రహదారికి మరమ్మత్తులు

- రూ.50 లక్షల నిధులతో పనులు..
- పర్యవేక్షించిన పినపాక ఎమ్మెల్యే పాయం..
- అధికారులకు పలు సూచనలు



**మణుగూరు, మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన మరమ్మతు పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించి పరిశీలించారు. గత కొన్ని నెలలుగా రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, స్కూల్ బస్సులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలిసిందే. గుంతల వలన వర్షాకాలంలో ప్రమాదాల అవకాశాలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో రహదారి పాడవకుండా మన్నికగా నిర్మించాలని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు చేశారు. నిర్మాణ ప్రమాణాలను కచ్చితంగా పాటించి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ రహదారి మరమ్మతు పూర్తయితే మణుగూరు ప్రాంత ప్రజలు, బీటీపీఎస్ ఉద్యోగులు, విద్యార్థులకు పెద్ద ఎత్తున ఉపశమనం కలగనుంది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కోర్స ఆనంద్, తమ్మిశెట్టి సాంబ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## జై భీమ్ 2026 డైరీ ఆవిష్కరణ

**సరూర్నగర్ సర్కిల్ ఎస్సీ లక్ష్మీనారాయణకి అందజేత**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**సరూర్ నగర్ సర్కిల్ లో సోమవారం జై భీమ్ 2026 కాలమానము ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నెంబర్ 202/2010 ఆధ్వర్యంలో నిర్వహించిన, ఈ కార్యక్రమంలో సరూర్నగర్ సర్కిల్ ఎస్సీ లక్ష్మీనారాయణకి 2026 డైరీ క్యాలెండర్ కాలమానము అంద చేయడం జరిగినది. సంఘం వ్యవస్థాపకులు జనరల్ సెక్రెటరీ మాతంగి శ్రీనివాస్ ఆదేశానుసారం సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి పి రవీందర్ ఆధ్వర్యంలో డైరీని బహుకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ప్రెసిడెంట్ పి ప్రవీణ్ కుమార్, అసోసియేషన్ నాయకులు కే మహేందర్, బి అశోక్, సి హెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దుద్దిళ్ళ శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయం..

**శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో 89వ జయంతి వేడుకలు..**



**మణుగూరు, మహా :**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దివంగత నేత దుద్దిళ్ళ శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయమని సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్ పేర్కొన్నారు. శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు మణుగూరు మండలం సంతోష్‌నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని రామగుండం-1 జీఎం డి లలిత్ కుమార్, ప్రముఖ పాత్రికేయురాలు, జిఎం అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శ్రీపాదరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ జననేతగా పేదల పక్షాన నిలిచిన నాయకుడిగా మంథని ప్రాంతంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తి శ్రీపాదరావు అని కొనియాడారు. వారి స్ఫూర్తితో ఆయన కుమారుడు, తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తండ్రి బాటలో నడుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగరీత్యా ఎక్కడ పనిచేసినా మణుగూరును మరచిపోకుండా బాలవెలుగు పాఠశాలను గుర్తుంచుకుని సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పాఠశాల నిర్వహకుడు బి జగన్మోహన్ రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రైస్ మిల్లర్స్


**పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సభ్యులు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నూతన కలెక్టర్ గా వచ్చిన అంకిత్ ను జిల్లా ఐడిఓసి కార్యాలయంలో సోమవారం జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, వెంకటేశ్వర రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఆనంద్, పల్లపోతు శ్రీనివాస్ జిల్లాలోని రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు విన్నవిస్తూ కలెక్టర్ కు అర్జీలు

- ఫిర్యాదుల పరిష్కారానికి ఆదేశాలు జారీ
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుద్దిళ్ళ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

- సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ
- హెడ్ ఆఫీస్ లో దుదిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర మాజీ శాసన సభ స్పీకర్ దివంగత దుదిళ్ళ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి సూర్యనారాయణ అన్నారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఆవరణలో మాజీ శాసన సభ స్పీకర్ దుదిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా శ్రీపాదరావు చిత్రపటానికి వివిధ శాఖల అధికారులు ఉద్యోగుల సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్ ఎల్.వి సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ దివంగత దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనంగా జరుపుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా కూడా ఈ జన్మదిన వేడుకలను జరుపుకున్నట్లుగా తెలిపారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అంచెలంచలుగా ఎదిగి మూడుసార్లు మంథని నియోజక వర్గం నుండి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా పని చేశారని చెప్పారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాలు తెలుసుకొని వారిని అభివృద్ధి పథంలో నడిపిన మహోన్నత వ్యక్తి అని నిబద్ధత గల నాయకుడిగా విలువలైన రాజకీయాలకు నిదర్శనంగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయతో పాటు గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి)కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ కార్పొరేట్ ప్రెసిడెంట్ ఎస్.వెంకటాచారి, జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాములోరికి గోటి తలంబ్రాలు


**భద్రగిరికి పాదయాత్రగా కదిలిన పెద్ద హరిజనవాడ**



**జూలూరుపాడు, మహా:** దక్షిణ అయోధ్యగా పేరుందిన భద్రాచలం రాములోరి కళ్యాణానికి గోటి తలంబ్రాలు సమర్పించేందుకు మండల పరిధి పెద్దహరిజనవాడ గ్రామ రామ భక్తులు సోమవారం భద్రగిరికి పాదయాత్రగా బయలుదేరారు. భక్తులు గత నెల రోజులుగా అత్యంత నియమ నిష్టలతో, కఠిన ఉపవాస దీక్షతో సిద్ధం చేసుకున్న "గోటి తలంబ్రాలను" భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సమర్పించనున్నారు. భక్తులంతా సంప్రదాయ కాషాయ వస్త్రాలు ధరించి, రాములవారికి ప్రియ భక్తుడైన హనుమాన్ జండాలను చేత బూని గ్రామం నుండి బయలుదేరారు. గ్రామంలో వీరి యాత్ర విజయవంతం కావాలని గ్రామస్తులంతా వారికి సహకరించిన తీరు, నెలకొన్న భక్తి వాతావరణం, చూపరులను భక్తి పారవశ్యంలో ముంచింది. తమ శ్రమను, భక్తిని భగవంతునికి సమర్పించే ఈ కార్యక్రమం గ్రామంలో ఒక పవిత్రమైన పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. తమ గ్రామం నుండి బయలుదేరిన భక్తులకు గ్రామ పెద్దలు, ఇతర గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. భద్రాచలం వరకు సాగే ఈ సుదీర్ఘ పాదయాత్ర గ్రామస్తుల గాఢమైన భక్తికి, సంప్రదాయాల పట్ల వారికి ఉన్న గౌరవానికి నిదర్శనం. భగవంతుని ఆశీస్సులతో తమ పాదయాత్ర విజయవంతంగా సాగి, సీతారాముల దర్శనం, తలంబ్రాల సమర్పణ సజావుగా సాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ పవిత్ర కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంపొందించింది.

## వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందిన హోంగార్డ్

- చాతి నొప్పితో హాస్పిటల్లో చేరిన వ్యక్తి మృతి
- రెండు గంటలు ఆలయాపన చేశారంట ఆరోపణ
- వైద్యుల నిర్లక్ష్యమే అంటున్న కుటుంబ సభ్యులు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రావిర్యాల గ్రామానికి చెందిన హోంగార్డ్, చాతి నొప్పితో హాస్పిటల్ లో చేరి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మహేశ్వరం మండలం రావిర్యాలకి చెందిన హోంగార్డ్ సంతోష్ కుమార్ ఆదివారం ఛాతి నొప్పితో అల్లాడుతుంటే తుక్కుగూడలోని విశిష్ట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పేరుతో రెండు గంటలు వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో మరణించాడని ఆయన బంధువులు ఆరోపించారు. పరిస్థితి చేయి దాటి పోయాక మరో హాస్పిటల్కి వెళ్లమన్నారని బంధువులు ఆందోళనకు దిగారు. ఇలాంటి ఆస్పత్రులను సీజ్ చేసి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం




**జూలూరుపాడు, మహా:**జూలూరుపాడు మండల వ్యాప్తంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందడం ద్వారా ఐదు లక్షల వరకు ఆ కుటుంబానికి ప్రమాద బీమా పార్టీ వర్తింప చేయడం ద్వారా ఆర్థిక భరోసా ఉంటుందని తెలిపారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మొదలు పెట్టిన పార్టీ ఉద్యమి సభ్యత్వం నమోదు అనేది మహోన్నత ఆశయాలతో నిండిన యజ్ఞం అని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మిన ప్రతి ఒక్క జన సైనికుడు, వీర మహిళలు సభ్యత్వ నమోదును భావోద్వేగంతో ముందుకు తీసుకుపోతున్నట్లు తెలిపారు. దేశంలో ఐదు రాష్ట్రాలలో జనసేన సభ్యత్వాలు ముమ్మరంగా సాగుతున్నాయని, మనమంతా బాధ్యతగా దానిని ముందుకు తీసుకెళ్లాలని జనసేన సాదక్, జన సైనికులకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 10వ తారీకు వరకే ఉండనుందని, ఈ తక్కువ సమయంలోనే క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో సభ్యత్వ నమోదును సాదక్, జన సైనికులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆర్థిక భరోసాతో అండగా నిలిచే జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత నమోదులో మండల ప్రజలు భారీ సంఖ్యలో భాగస్వాములు కావాలని ఉసికల రమేష్ కోరారు.

## పరిక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం పరీక్షా కేంద్రం, తెలంగాణ సామాజిక సంక్షేమ నివాస పాఠశాల బాలుర విభాగంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు. పరీక్షలు నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పోలీసు బందోబస్తు సీసీ కెమెరాల పనితీరు అభ్యర్థుల హాజరు నమోదు విధానం ఇన్విజిలేటర్ల విధుల నిర్వహణ ప్రశ్నపత్రాల రవాణా భద్రపరచడం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాయేందుకు తగిన డెస్కులు సరైన లైటింగ్ ఫ్యాన్లు తాగునీటి సదుపాయం నిరంతర విద్యుత్ సరఫరా ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా క్రమశిక్షణతో నిర్వహించబడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా సోమవారం ఐడీఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారని తెలిపారు. మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారని అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారని ప్రశంసించారు. గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి విశేషమైనదని సరళత సమగ్రత నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగా నిలిచాయని కలెక్టర్ తెలిపారు.

## ప్రజాస్వామ్య బలోపేతంలో యువతే కీలకం




**ఖమ్మం:** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అపారమైన మేధోసంపత్తి కలిగిన యువత చదువు, ఉద్యోగాలతో పాటు రాజకీయాల వైపు, నాయకత్వం వైపు అడుగులు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వేదికగా జరిగిన జిల్లా స్థాయి యువ పార్లమెంట్ పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా మారి, సభా మర్యాదలను పాటిస్తూ దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలపై చర్చించారు. ప్రశ్నలు అడగడం, సమాధానాలు చెప్పడం, బిల్లులపై చర్చ వంటి అంశాల్లో తమ ప్రతిభను చాటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ పనితీరు, చట్టాల తయారీ ప్రక్రియపై యువతకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమైనదాని కార్యక్రమ ముఖ్య అతిథి పాల్గొన్న జిల్లా మహిళా ప్రాంగణ సంక్షేమ అధికారినీ వేల్పుల విజేత అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేవలం ఓటు వారు వేయడమే కాకుండా, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమస్యలను ప్రశ్నించే తత్వం, విశ్లేషణాత్మక ఆలోచనలు యువతను ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దుతాయనీ కొనియాడారు ప్రజాస్వామ్య రక్షణ కోసం రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే పటిష్టమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించగలం. ఈ జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 గురినీ ప్రథమ స్థానం ఎం అఖిల, ద్వితీయ స్థానం లావణ్య, తృతీయ స్థానం ఎం డి నదియా హసీన్, 4వ స్థానం పి హనుమంత్, 5వ స్థానం ఎస్ కె హుస్సేన్ బీ విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మరో 5 గురు ప్రతిభ సర్టిఫికేట్ అందజేశారు. మరో ముఖ్యఅతిథి 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావడం ద్వారానే నిజాయితీ గల నాయకుడు తయారు అవుతారని అన్నారు. ఖమ్మం రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి యువ మాక్ పార్లమెంట్ కు ఎంపిక చేస్తారనీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి తెలిపారు. ప్రతినిధులు దేశ రాజధాని ఢిల్లీలో తమ గళాన్ని వినిపించే అవకాశం లభిస్తుంది. వికాసిత్ భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భాను చందర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఏ జె రామారావు, ఐ క్యూ ఎ సి కో ఆర్డినేటర్ అసోసియట్ ప్రొఫెసర్ ప్రవీణ్, జ్యూరీ సభ్యులు రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బి వెంకటేశ్వర రెడ్డి, ఎస్ ఆర్ అండ్ బిజీ ఎన్ ఆర్ అధ్యాపకులు డాక్టర్ డి ధనమూర్తి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రవి వర్ధన్, జ్యూరీ సభ్యులు తెలుగు అధ్యాపకులు వెంకటరమణ, మోటివేషనల్ స్పీకర్ తాటిపల్లి సుధీర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్యామల దేవి, రాంకుమార స్వామి, కళాశాల అధ్యాపకులు చేకూరి రమేష్ అసోసియేట్ ప్రొఫెసర్ బొంద్యాల నాయక్ రాజనీతి శాస్త్ర అధ్యాపకులురాలు డాక్టర్ ఎ చరిత్ర అద్దేపల్లి, అధ్యాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, రవిశంకర్, విద్యార్థినులు మరియు జిల్లా యువజన అధికారులు పాల్గొన్నారు. విజేతలను అభినందిస్తూ, వారు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

### ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి

## వేగవంతమైన చర్యలు చేపట్టాలి

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనలతో కలిసి కలెక్టర్ ప్రజల వినతులను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ | 03-03-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM


## ఎమ్మెల్యే పాయంకు పంచాయతీల పాలకవర్గాల వినతులు

**గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి..**



**మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని పలు పంచాయతీల పాలకవర్గాలు సమస్యలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందజేశారు. మణుగూరు పట్టణంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయంను సోమవారం ప్రత్యేకంగా ఆయా పంచాయతీల పాలకవర్గ సభ్యులు కలసి వినతి పత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం ఆయా పంచాయతీల పాలకవర్గ సభ్యులకు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేసిన పాలకవర్గాల్లో మణుగూరు మండలం సమితి సింగారం మేజర్ గ్రామపంచాయతీ, సాంబాయిగూడెం గ్రామపంచాయతీ, గుట్ట మల్లారం గ్రామపంచాయతీ లతోపాటు ముసలమడుగు గ్రామపంచాయతీకి చెందిన పాలకవర్గ ప్రజా ప్రతినిధులు గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ఈ గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కొరత, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రధానంగా రహదారుల మరమ్మతులు, కాలువల నిర్మాణం, తాగునీటి సదుపాయం, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు కొలపిన్ని మానస, ఉకే కృష్ణవేణి, ఎస్కే రహీం పాషా, మాదాడి రాజేష్ లతో పాటు ఆయా పంచాయతీల పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మీ పాలనలో మరింత అభివృద్ధి జరగాలి

**కలెక్టర్ అంకిత్ కు శుభాకాంక్షలు తెలిపిన పాత్రికేయ బృందం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మీ పరిపాలనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరింత అభివృద్ధిలో ముందుకు పోవాలని ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ అంకిత్ ను సోమవారం కలెక్టరేట్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో కొన్ని పరిశ్రమలు ఉన్నప్పటికీ యువతకు మరింత ఉపాధి కల్పించేందుకు నూతన పరిశ్రమల ఏర్పాటుకు తమ వంతుగా కృషి చేయాలని పాత్రికేయులు కలెక్టర్కు సూచించారు. ముఖ్యంగా విద్యా వైద్యంపై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం వందే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణికి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగే విధంగా చూడాలని కలెక్టర్కు పాత్రికేయుల మిత్రబృందం సూచించింది. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాసరావు, టెన్యూ జిల్లా అధ్యక్షుడు వట్టి కొండ రవి, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు కాగితపు వెంకటేశ్వరరావు, ఎండి షఫీ, ప్రభాకర్ రెడ్డి, ఈనాడు సతీష్, నాగ చారి, రాము, ప్రవీణ్, ఉప్పల్, రాజ్ కుమార్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సంతాన వేణుగోపాలస్వామి.. కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే పాయంకు ఆహ్వానం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో భక్తి, శ్రద్ధలతో నిర్వహించనున్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి మణుగూరు శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు ఆలయ ఆహ్వాన కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. మణుగూరు రామానుజవరం ప్రాంతంలోని పవిత్రక్షేత్రం శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించనున్న ఈ కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరగనుంది. భక్తుల కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందిన స్వామివారి కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆహ్వాన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి కార్యక్రమానికి విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మణుగూరులోని సిపిఐ, బిఆర్ఎస్ పార్టీ లతోపాటు రాజకీయ పార్టీల నాయకులకు, సంఘాలకు, ప్రభుత్వ అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆహ్వానం అందజేసిన వారిలో గుడి చైర్మన్ వత్సవాయి రామరాజు, వైస్ చైర్మన్ నోముల రవి, మాజీ సర్పంచ్ బాడిషా సతీష్, దేశ బోయిన ఎల్లారావు, ఆకుల నరసింహారావు, మామిళ్లపల్లి సీతారాములు, మామిళ్లపల్లి శ్రీను, కృష్ణారావు, మదర్ పల్లపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## జాతీయ స్థాయి కరాటేలో రాహుల్ విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ



**చర్ల మహా:** జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సుమన్ చోటాఖన్ కరాటే డో మరియు స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆరుగురు రాహుల్ విద్యార్థులు సత్తా చాటారు .ఈ సందర్భంగా వారికి సోమవారం పాఠశాల ఆవరణలోముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల వ్యవస్థాపకురాలు శ్రీమతి డాక్టర్ ప్రతిభ విద్యార్థులకు స్వయంగా బెల్టులను , ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ డీఎన్ కుమార్, డాక్టర్ ప్రతిభ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీవీపీసీ శాస్త్రి లు కరాటే మాస్టర్ ముత్తు 7 వ డాన్ బ్లాక్ బెల్ట్, మరియు జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన విద్యార్థుల వివరాలు: ఎన్. లేక్ష్య శ్రీ , 5వ తరగతి బ్రౌన్ బెల్ట్ , కె. రీతన్య, 4వ తరగతి బ్లూ బెల్ట్ , కె. షణ్ముఖ 3వ తరగతి బ్లూ బెల్ట్ , వై. డమరుతి 5వ తరగతి బ్లూ బెల్ట్ , సహస్ర 5వ తరగతి బ్లూ బెల్ట్, యశస్విని 5వ తరగతి గ్రీన్ బెల్ట్ ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిభ మాట్లాడుతూ. తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ప్రమాణాలతో కరాటేలో రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆత్మరక్షణ విద్యలతో పాటు చదువులోనూ విద్యార్థులు ముందుండాలని వారు ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వర్మరాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఎంవీవీఎల్ నరసింహారావు, బోసు బాబు, క్రాంతి కుమార్, శ్రీధర్ బాబు, ఆనంద్ మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను యధావిధిగా కొనసాగించాలి

**జి.ఎం శ్రీనివాస్ కు ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు వినతి**



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని జలగం వెంగళరావు ఉపరితల గనిలో భూములు కోల్పోయి 2007సం" గని ప్రారంభం నుండి కాంట్రాక్ట్ కార్మికులు గా విధులు నిర్వర్తిస్తున్న కిష్టారం, కొమ్మేపల్లి, రేజర్ల గ్రామస్తులను యధావిధిగా తమ విధులలో కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి తమ పంట పొలాలు సైతం త్యాగం చేసి సింగరేణి సంస్థలో దినసరి కూలీలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సింగరేణి సంస్థ ఆదుకోవాలని, సంస్థలో పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న డి.ఎల్.ఆర్ వ్యవస్థను జే.వి.ఆర్ ఓ.సి లో యధాతథంగా కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.ఆర్ ఇంచార్జ్ మురళీకృష్ణ, వీరబాబు, సురేష్, ప్రభాకర్, రాజశేఖర్, రాము, ప్రసాద్, రాజేష్, సుభాని, నాగుల్ మీరా, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతీ



**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతీ నియమితులయ్యారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.వి. కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన పంతంగి మారుతీని నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వి. కృష్ణారావు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి మారుతీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధికి మరింత కృషి చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు మారుతీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘం అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా గౌరవ సలహాదారు పద్మచారి, జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథి, జిల్లా కార్యదర్శి మక్కాల వెంకన్న, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గునిగంటి వీరన్న, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి రామకృష్ణ, బీసీ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి సంత దేవాలయంలో కన్నుల పండుగగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**కారేపల్లి, మహా:** సింగరేణిమండల కేంద్రంలో గల సంత గుడి ప్రాంగణంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ,ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కల్యాణ క్రతువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం వేళ నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పుష్పాలతో కళ్యాణ మండప ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు. కల్యాణ వేడుక సందర్భంగా మంగళ వాయిద్యాలు మారుమోగి భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంచాయి. నాదస్వరాలు, తాళాలు, డోలు వాయిద్యాల శుభ నాదం మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా కొనసాగింది. కల్యాణ సమయంలో అర్చకులు స్వామివారి దివ్య గుణాలను, కల్యాణ మహిమలను వివరించారు. పలువురు దంపతులు, దాతలు పీటలపై కూర్చున్నారు. కల్యాణా అనంతరం ఆలయ మండపం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామ వీధులలో కళ్యాణ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఈవో వేణుగోపాలచార్యులు, జూనియర్ అసిస్టెంట్ మూడ్ మోహన్ చౌహాన్, పగడాల మోహన్ కృష్ణ, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, సిబ్బంది, పూజారులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు, యువకులు, మహిళలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖులు ఈ కళ్యాణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని సేవలందించారు.

## రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం హుజూర్నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది లేబర్ తీసుకొని పనులు పూర్తి చేసి మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అన్నారు. బ్లాక్ లో మధ్య గల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ మొదలైన అన్ని రకముల పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాస్, హౌసింగ్ పిడి సిద్ధార్థ, మిషన్ భగీరథ ఇ.ఇ. కరుణాకర్ రెడ్డి, హార్టికల్చర్ పిడి నాగయ్య, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావు కు ఘన సన్మానం



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావుని హుజూర్ నగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ కుక్కల నాగరాజు మఠంపల్లి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్ యాతవాకిళ్ళ మాజీ సర్పంచ్ బుడిగ కాశయ్య యాతవాకిళ్ళ గ్రామ ఉప సర్పంచ్ బొమ్మకంటి బాల నాగయ్య వార్డు మెంబర్స్ కుక్కల పెద్ద సైదులు మాలోతు బాలు నాయక్ మాలోత్ వినోద్ నాయక్ యాతవాకిళ్ళ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జక్కుల గురువయ్య యాదవ్ లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ గజమాలతో ఘనంగా సన్మానించారు

## మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మితే జైలుకే..

**పాన్ షాపుల యజమానులకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ సీరియస్ వార్నింగ్..**



**నల్లగొండ మహా టౌన్:** మైనర్ల భవిష్యత్తును పొగాకు సెగతో చిన్నాభిన్నం చేస్తున్న విక్రేతలపై నల్లగొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ టూ టౌన్ ఎస్సై సైదులు స్థానిక పాన్ షాపుల యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. చిన్నపిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలతో పాటు, జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు..**

సమాజంపై విషం చిమ్ముతున్న పొగాకు వ్యాపారంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు... పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో (100 మీటర్ల లోపు) ఉన్న పాన్ షాపులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా ఉండటమే దీని లక్ష్యం. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించనున్నాయి. ఏ చిన్న ఉల్లంఘన జరిగినా ఉపేక్షించే ప్రసక్తే లేదని పోలీసులు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే షాపుల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు, యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ల బంగారు భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా పొగాకు విక్రయాలు జరిపితే ఎంతటి వారైనా సరే వదిలిపెట్టేది లేదు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలుంటాయన్న టూటౌన్ పోలీసులు..

## వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవం

**సాంప్రదాయపద్ధంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి వార్షికోత్సవ వేడుకలు**



**కారేపల్లి, మహా:** మండల కేంద్రమైన కారేపల్లిలోని శ్రీ పోతులూరి గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మొదటి సంవత్సర వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం ఫిబ్రవరి రెండో తేదీన కాలజ్ఞాన ప్రదాత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నూతనంగా నిర్మించి గోవిందమాంబశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల ఉత్సవ ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. కాగా దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మోజు రామమూర్తి, వేములూరికోట చారితోపాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షికోత్సవ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను ప్రధాన అర్చకులు అందజేశారు.

## అభివృద్ధి పథంలో దుబ్బ తండ గ్రామపంచాయతీ



**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిధిలోని దుబ్బతండ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు సోమవారం స్థానిక సర్పంచ్ మాత్రు నాయక్ , ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి కల్పించడమే తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతుందని, కూలీలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని కోరారు. గ్రామంలో రహదారుల మరమ్మత్తులు, చెరువుల శుభ్రత, కాలువల నిర్మాణం, చెట్లు నాటడం వంటి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు గ్రామ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఉపయోగపడతాయని చెప్పారు. వేసవి తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని, గ్రామ ప్రజలందరూ కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.,

## ప్రపంచ మానవాళి మనుగడకే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతుంది

**శీతల రోషపతి**



**హుజూర్ నగర్ మహా:** ప్రపంచ మానవాళి మనుగడకే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ,అమెరికా-ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు మరణించడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి తెలిపారు. ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు ప్రారంభిస్తే మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశముందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం ఉన్న భారతీయులను తక్షణమే సురక్షితంగా భారతదేశానికి తీసుకురావాలని, వారి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆయన డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్ పాలకుల మత అసహనం దేశాన్ని సంక్షోభ దిశగా నడిపిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య విధానాలను పాటిస్తూ ప్రజలను గౌరవించి ఉంటే ఇలాంటి పరిస్థితులు రావని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకులు, ప్రజలపై తీవ్ర చర్యలు తీసుకున్నారని, వేలాది మందిని హతమార్చిన ఘటనలపై ప్రపంచ దేశాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. చైనా, రష్యా మరియు ఐక్యరాజ్యసమితి పరిస్థితిని నియంత్రించేందుకు ముందుకు రావాలని, ఇందులో భారతదేశం కూడా కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, పద్మ, శారద, మణి, రజిత, జానకి, తిరుపతమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కమిటీ సమావేశంలో పాల్గొని ఆహార మెనూ, నిల్వల (స్టాక్) పరిస్థితిని కూడా పరిశీలించిన కౌన్సిలర్ కృష్ణ



**హుజూర్నగర్ మహా:** హుజూర్‌నగర్ పట్టణంలోని గోదాం బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కమిటీ సమావేశం లో అంగన్‌వాడీ టీచర్ సరళ కుమారి ఆహ్వానం మేరకు 19 వ వార్డు కౌన్సిలర్ వల్లపు దాసు కృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో 05 సంవత్సరాల చిన్నారులకు అందిస్తున్న సేవలు, అలాగే గర్భిణీ మహిళలు మరియు బాలింతలకు అందిస్తున్న పోషకాహార కార్యక్రమాలు గురించి తెలుసుకుని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మరియు వారి తల్లులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంగన్ వాడీ కేంద్రంలో ఉన్న ఆహార మెనూ, నిల్వల (స్టాక్) పరిస్థితిని కూడా పరిశీలించాను. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యత్ర నిర్మల, సంధ్య ఇంద్రాల పాల్గొని తమ సేవల గురించి వివరించారు. అనంతరం 19 వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన కృష్ణ ను శాలువాతో సన్మానించడం జరిగింది.

## స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు ఇంటర్ విద్యార్థుల బలి..

**నల్గొండ చందనపల్లి వద్ద ప్రమాదం విషాదంలో రెండు గ్రామాలు..**



**నల్గొండ మహా :** వారిద్దరూ రేపటి పౌరులుగా ఎదగాలని కలలు కన్నారు.. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత చదువులతో తల్లిదండ్రుల కష్టాన్ని తీర్చాలనుకున్నారు. కానీ విధి ఆ విద్యార్థులపై కన్నెర్ర చేసింది. ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ చేసిన అనాలోచిత తప్పిదం అజాగ్రత్త.. ఆ ఇద్దరు యువకుల ప్రాణాలను గాల్లో కలిపేసింది. చందనపల్లి సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం రెండు గ్రామాల్లో తీరని విషాదాన్ని నింపింది. శాలిగౌరారం మండలం బండమీది గూడెం గ్రామానికి చెందిన గైగుల్ల వంశీ (20), ఉట్కూర్ గ్రామానికి చెందిన గుడిసె రవి (20) స్నేహితులు. సోమవారం ఉదయం తమ ద్విచక్ర వాహనం (స్ప్లెండర్ ప్లస్) పై ఇంటర్మీడియట్ పరీక్ష రాసేందుకు నల్గొండ పట్టణానికి బయలుదేరారు. నల్గొండ మండలం చందనపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న SPR పాఠశాలకు చెందిన బస్సు ఒక్కసారిగా అతివేగంగా యూటర్న్ తీసుకుంది. అకస్మాత్తుగా బస్సు అడ్డు రావడంతో బైక్‌ను నియంత్రించలేకపోయారు. దీంతో వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాద తీవ్రతకు యువకులిద్దరూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు ఇతర శరీర భాగాలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో వంశీ, రవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

**డ్రైవర్ నిర్లక్ష్యమే యువకులకు శాపమైంది..**

ప్రమాద స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బస్సు డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ అజాగ్రత్తగా వాహనాన్ని మలుపు తిప్పడమే ఈ అనర్థానికి ప్రధాన కారణం. పరీక్ష రాసే ఉత్సాహంతో వెళ్తున్న విద్యార్థుల హాల్ టికెట్లు, పెన్నులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. చదువుకుని ప్రయోజకులవుతారనుకున్న కొడుకులు శవాలై పడి ఉండటం చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వంశీ తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్గొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. "ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల వేగానికి అడ్డుకట్ట వేయాలి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డ్రైవర్లపై, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని, బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడిపినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని నల్గొండ రూరల్ ఎస్సై సైదా బాబు తెలిపారు.

# ఈపీఎఫ్ వడ్డీ యథాతథం.. ఖాతాల్లోకి జమ ఎప్పుడంటే?




ఈపీఎఫ్ వడ్డీ రేటు పెరుగుతుందా.. అని ఎదురు చూసేవారికి నిరాశ ఎదురైంది. ఎందుకంటే.. 202526 సంవత్సరానికి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (EPF) డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25 శాతంగానే నిర్ణయించారు. అంటే వడ్డీ రేటులో ఎలాంటి మార్పు లేదన్నమాట. ఈపీఎఫ్ఓ తన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (CBT) సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి EPF డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును కొనసాగించాలని నిర్ణయించింది. సీబీటీ నిర్ణయం తర్వాత.. 202526 సంవత్సరానికి EPF డిపాజిట్లపై వడ్డీ రేటును ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపుతారు. ప్రభుత్వం ఆమోదం పొందిన తర్వాత, 202526 సంవత్సరానికి వడ్డీ రేటు ఏడు కోట్ల చందాదారుల ఖాతాల్లోకి జమ అవుతుంది. నిజానికి 2024లో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO), చందాదారులకు 201516లో వడ్డీ రేటు 8.8 శాతం వడ్డీని అందించింది. ఆ తరువాత వడ్డీ రేటును తగ్గించి 201617లో 8.65 శాతం & 201718లో 8.55 శాతం అందించింది. 202021లో 8.5 శాతం వద్ద ఉన్న వడ్డీ రేటును 202122 సంవత్సరానికి 8.10 శాతంగా నిర్ణయించారు. 202223లో 8.15 శాతంగా ఉన్న వడ్డీ రేటును 202324కి స్వల్పంగా 8.25 శాతానికి పెంచింది. ఇప్పుడు కూడా అదే వడ్డీ రేటు కొనసాగుతోంది.

# కారులో ఈ 10 వస్తువులుంటే.. మీరు సేఫ్!

**కారు ఉపయోగించే చాలామంది.. లోపల అవసరం ఉన్న వస్తువుల కంటే, అనవసరమైన వస్తువులనే ఎక్కువ ఉంచుకుంటున్నారు. అయితే కారులో ఎలాంటి వస్తువులు ఉంచుకోవాలి, ముఖ్యమైన 10 వస్తువులు ఏవి? అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.**



**జంపర్ కేబుల్స్:**

వాతావరణంలో జరిగే మార్పులు లేదా ఇతర పొరపాట్ల కారణంగా లైట్లు ఆఫ్ చేయకుండా కొన్ని సందర్భాల్లో వదిలేస్తారు. అలాంటి సందర్భాల్లో బ్యాటరీ డెడ్ కావచ్చు. ఇలాంటి పరిస్థితిలో జంపర్ కేబుల్స్ ఉంటే సమస్యను వెంటనే పరిష్కరించుకోవచ్చు.

**జాక్ & స్పేర్ టైర్:**

అనుకోని సందర్భాల్లో టైర్ పంక్చర్ అయితే.. ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి స్పేర్ టైర్ & జాక్ వంటి వాటిని కారులోనే ఉంచుకోవడం వల్ల.. టైర్ పంక్చర్ సమయంలో మీరే సమస్యను పరిష్కరించుకోవచ్చు.

**ఫస్ట్ ఎయిడ్ కిట్:**

కేవలం కారులో మాత్రమే కాకుండా.. ప్రతి వాహనంలో తప్పకుండా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. అందులో బ్యాండేజీలు, యాంటిసెప్టిక్ వైప్స్, ట్వీజర్స్, పెయిన్ రిలీవర్స్ వంటి అవసరమైన వస్తువులు ఉండాలి.

**టైర్ ప్రెజర్ గేజ్:**

టైర్లు బయటికి సరిగానే కనిపించినా, లోపల గాలి ఒత్తిడి సరైన స్థాయిలో లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. క్రమం తప్పకుండా టైర్ ప్రెజర్ చెక్ చేసుకుంటూ ఉండటం మంచిది.

**అదనపు బ్యాటరీలతో ఫ్లాష్‌లైట్:**

కారులో తప్పకుండా ఫ్లాష్‌లైట్ ఉండాలి. దీనికి అదనపు బ్యాటరీలు కూడా చాలా అవసరం. రాత్రివేళల్లో లేదా చీకటి ప్రదేశాల్లో ఫ్లాష్‌లైట్ ఉపయోగపడుతుంది. కారు బానెట్ క్రింద పరిశీలించాల్సినప్పుడు కూడా ఇది సహాయపడుతుంది.

**ఎమర్జెన్సీ బ్లాంకెట్:**

చలికాలంలో లేదా వాహనం ఆగిపోయినప్పుడు ఒక బ్లాంకెట్ తప్పకుండా అవసరం అవుతుంది. ఇది అత్యవసర సమయంలో మీకు చాలా ఉపయోగపడుతుంది.

**మల్టీటూల్ (స్విస్ ఆర్మీ నైఫ్):**

చిన్న చిన్న పనులకు ఇది చాలా ఉపయోగపడుతుంది. ఇది చూడటానికి చిన్నదే అయినా.. చాలా సందర్భాల్లో పనికొస్తుంది. దీనిని మీరు గ్లోవ్ బాక్స్‌లో కూడా పెట్టుకోవచ్చు.

**వాటర్ బాటిల్:**

వాటర్ బాటిల్ కేవలం నీళ్లు తాగడానికి మాత్రమే కాదు. అనుకోని సందర్భాల్లో గాయాలైనప్పుడు, వాటిని శుభ్రం చేయడానికి కూడా ఉపయోగపడుతుంది. ఇంజిన్ వేడెక్కినప్పుడు కూడా నీళ్లు అవసరమవుతాయి. సీల్ చేసిన బాటిల్స్ ఉంచుకోవడం మంచిది.

**ఫోన్ ఛార్జర్ లేదా పవర్ బ్యాంక్:**

ఫోన్ ఛార్జర్ లేదా పవర్ బ్యాంక్ ఉండడం వల్ల మీ ఫోన్ ఎప్పుడూ ఆఫ్ కాకుండా ఉంటుంది. కొన్నిసార్లు జీపీఎస్ న్యావిగేషన్ లేదా ఎమర్జెన్సీ కాల్స్ చేసుకోవడానికి ఫోన్ చాలా అవసరం. కాబట్టి మీ దగ్గర ఉన్న ఫోన్ ఎప్పుడూ స్విచాఫ్ కాకుండా ఉంచడానికి ఫోన్ ఛార్జర్ & పవర్ బ్యాంక్ తప్పనిసరిగా మీతో ఉంచుకోవాలి.

**వెహికల్ రిజిస్ట్రేషన్ & ఇన్సూరెన్స్ డాక్యుమెంట్స్:**

కారుకు సంబంధించిన ముఖ్యమైన పత్రాలను కూడా కారులో ఉంచుకోవాలి. ట్రాఫిక్ పోలీసులు, ఇతర అధికారులు మీ కారును చెక్ చేసే సమయంలో వెంటనే చూపించడానికి ఇవి పనికొస్తాయి.

# పెరిగిన గ్యాస్ ధరలు..

## 19 కిలోల సిలిండర్ కొత్త రేటు..



మార్చి నెలకు ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. దేశవ్యాప్తంగా కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలు రూ.28 నుంచి రూ.31 వరకు పెరిగాయి. అయితే 14 కిలోల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకపోవడం సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం.


**ప్రధాన నగరాల్లో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరలు**

రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1740.50 నుంచి రూ.1768.50కు పెరిగింది. కోల్‌కతాలో ధర రూ.1844.50 నుంచి రూ.1875.50కు చేరింది. ముంబైలో రూ.1692 నుంచి రూ.1720కు పెరిగింది. అలాగే చెన్నైలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1899.50 నుంచి రూ.1929కు, హైదరాబాద్‌లో రూ. 1,962.50 నుంచి రూ. 1,990.50కు విశాఖపట్నంలో రూ. 1,791.50 నుంచి రూ. 1,822.50కు పెరిగినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి.

**గృహ ఎల్పీజీ రేట్లు యథాతథం**

ఆయిల్ కంపెనీల తాజా వివరాల ప్రకారం 14.2 కిలోల గృహ ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో ఇది రూ.853కు అందుబాటులో ఉంది. కోల్‌కతాలో రూ.951గా కొనసాగుతోంది. ముంబైలో రూ.852.50గా ఉంది. లక్నోలో గృహ సిలిండర్ ధర రూ.890.50గా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో రూ. 905, విశాఖపట్నంలో రూ. 861లుగా ఉంది. కమర్షియల్ సిలిండర్ ధరలు పెరగడం హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే గృహ వినియోగ సిలిండర్ ధరల్లో మార్పు లేకపోవడం సామాన్యులకు కొంత ఊరట కలిగిస్తోంది.

# పెట్టుబడులకు చక్కని వైవిధ్యం



పెట్టుబడులకు వైవిధ్యం ఎంతో అవసరం. దీని వల్ల నష్టాల రిస్క్‌ను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అన్ని పెట్టుబడులను ఒకే చోట పెట్టడం కంటే.. వివిధ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్టాల రిస్క తగ్గుతుంది. ఒకే ఫండ్‌తో చక్కని వైవిధ్యం కోరుకునే వారికి పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ చక్కగా సరిపోతుంది. దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులతో, తక్కువ నష్టాల రిస్క్‌తో ఈ పథకం మెరుగ్గా రాణిస్తోంది.

**రాబడులు**

ఈ పథకానికి మంచి రాబడుల చరిత్రే ఉంది. ఈ పథకం 2013లో ఆరంభం కాగా, నాటి నుంచి నేటి వరకు ఏటా సగటున 19 శాతం చొప్పున రాబడులను అందించింది. గత ఐదేళ్లలోనూ రాబడి ఇదే స్థాయిలో ఉంది. మూడేళ్లలో మాత్రం ఏటా 20.94 శాతం చొప్పున, ఏడాది కాలంలో 10 శాతం మేర పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. ఫ్లెక్సీక్యాప్ విభాగం సగటు రాబడి కంటే 6 శాతం వరకు అధిక ప్రతిఫలం ఈ పథకంలోనే ఉండడం గమనించొచ్చు.

**పెట్టుబడుల విధానం**

మంచి రాబడుల అవకాశాలు ఎక్కడ ఉంటే అక్కడ ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఈ ఫండ్‌కు ఉంది. స్థానిక కంపెనీలతో పాటు విదేశీ కంపెనీల్లోనూ ఇన్వెస్ట్ చేయడం ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. ముఖ్యంగా అమెరికాకు చెందిన దిగ్గజ టెక్నాలజీ కంపెనీల్లో ఈ పథకం చెప్పుకోతగ్గ స్థాయిలో ఇన్వెస్ట్ చేసింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఫేస్‌బుక్‌లో ఈ పథకానికి గణనీయమైన పెట్టుబడులు ఉన్నాయి. వ్యాల్యూ స్టాక్స్‌కు ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంటుంది. అంటే కంపెనీ వ్యాపారం, మూలాల పరంగా మంచి విలువ కలిగి, ఆకర్షణీయమైన ధరల్లో ఉన్నప్పుడు ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులు తెచ్చిపెట్టే వ్యూహాన్ని పాటిస్తోంది. వాస్తవ విలువలకు మించి గరిష్ట స్థాయిల్లో ట్రేడవుతున్న స్టాక్స్‌కు దూరంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిస్క్‌ను సాధ్యమైనంత తగ్గించే విధంగా పనిచేస్తుంది. స్టాక్స్‌ను తరచూ మార్చదు. ఒక కౌంటర్‌లో దీర్ఘకాలం పాటు కొనసాగడాన్ని పాటిస్తుంది. స్థూల ఆర్థిక అంశాలు కాకుండా.. ఎంతో విలువ దాగున్న స్టాక్స్‌ను గుర్తించి పెట్టుబడులు పెడుతుంటుంది. పరిస్థితులకు అనుగుణంగా డెట్ సెక్యూరిటీలు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లలో (రీట్)నూ ఇన్వెస్ట్ చేస్తుంటుంది. మధ్యకాల లక్ష్యాలకు (5-7 ఏళ్లు) దీర్ఘకాల లక్ష్యాలకు (10 ఏళ్లకు అంతకుమించి) ఈ పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

**పోర్ట్ ఫోలియో**

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.1,33,970 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 77.32 శాతం ఈక్విటీల్లో, డెట్ సాధనాల్లో 13.71 శాతం, ఈక్విటీ హెడ్జింగ్ ఇన్‌స్ట్రుమెంట్లలో 2.53 శాతం, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలో 1.33 శాతం చొప్పున పెట్టుబడులు పెట్టింది. 5.11 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. రంగాల వారీ పెట్టుబడులను పరిశీలిస్తే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 33.80 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 25.29 శాతం, కన్స్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 7.48 శాతం చొప్పున కేటాయించింది. ప్రతినెలా రూ.1000 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.




# చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టిన పడవ

## ఒమన్ తీరంలో భారతీయుడి మృతి



**దుబాయ్:** ఒమన్ సముద్ర తీరంలో ఘోరం జరిగింది. భారీ చమురు ట్యాంకర్‌ను పేలు డు పదార్థాలతో నింపిన మరో పడవ ఢీకొట్టడంతో ఒక భారతీయుడు మృతిచెందాడు. ఆ ట్యాంకర్‌లోని ఇతర సిబ్బందిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. మస్కట్ గవర్నరేట్‌లోని పోర్ట్ సుల్తాన్ ఖబూస్‌కు 52 నాటికల్ మైళ్ల దూరంలో హార్మూజ్ జలసంధిలో ఆదివారం ఈ ఘటన జరిగినట్లు ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది. ఎంకేడీ వ్యోమ్ అనే పేరు గల ఈ చమురు ట్యాంకర్‌పై రిపబ్లిక్ ఆఫ్ ద మార్షల్ ఐలాండ్స్ జెండా ఉంది. ఘటన జరిగిన సమయంలో ట్యాంకర్‌లో 59,463 మెట్రిక్ టన్నుల చమురు ఉన్నట్లు తెలిసింది. మనుషులెవరూ లేని భారీ పడవ ఢీకొట్టడంతో చమురు ట్యాంకర్ ఇంజన్ గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే విధుల్లో ఉన్న భారతీయుడు మృతిచెందాడు. అతడి వివరాలు తెలియరాలేదు. ట్యాంకర్‌లో ఇంకా 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 16 మంది భారతీయులు కాగా, నలుగురు బంగ్లాదేశీలు, ఒకరు ఉక్రెయిన్ పౌరుడు. వారందరినీ ఒమన్ అధికారులు రక్షించారు.

# న్యూక్లియర్ వాచ్ డాగ్ వార్నింగ్, స్పందించని ఇరాన్

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రికత్తల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డైరెక్టర్ జనరల్ రఫెల్ మరియానో గ్రాస్సీ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం IAEA బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్‌లోని అణుకేంద్రాలపై దాడులు జరిగితే, ప్రమాదకరమైన రేడియోధార్మిక పదార్థాలు వాతావరణంలోకి విడుదలయ్యే ప్రమాదం ఉందని, ఆ అవకాశాన్ని తాము తోసిపుచ్చలేమని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ సరిహద్దు దేశాలలో సాధారణ నేపథ్య స్థాయిలకంటే రేడియేషన్ స్థాయిలు పెరగనప్పటికి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది, ప్రధాన నగరాల కంటే పెద్దవిగా లేదా పెద్దవిగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయాల్సిన అవసరంతో సహా తీవ్రమైన పరిణామాలతో కూడిన రేడియోలాజికల్ విడుదల ప్రమాదం ఉందన్నారు. పరిస్థితి మరింత ముదరకుండా ఉండాలంటే గరిష్ట సంయమనం పాటించాలి. తిరిగి దౌత్య చర్చలు జరగాలని కోరారు. ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ అణు కేంద్రాలపై ప్రభావం పడిందని చెప్పడానికి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని ఐక్యరాజ్యసమితి అణుశక్తి విభాగం చీఫ్ రాఫెల్ గ్రోసీ స్పష్టం చేశారు. ఇప్పటివరకు మాకున్న సమాచారం ప్రకారం, ఇరాన్‌లోని ఏ అణు కేంద్రం కూడా దెబ్బతినలేదు" అని పునరుద్ఘాటించారు. ఒకవేళ అణు వికిరణం (Radiation) సంభవిస్తే, అది అత్యంత భయంకరమైన పరిణామాలకు దారితీస్తుందని గ్రోసీ హెచ్చరించారు. దీనివల్ల పెద్ద నగరాలు, పెద్ద ప్రాంతాల నుండి ప్రజలను అత్యవసరంగా ఖాళీ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, ఇరాన్ అణు నియంత్రణ అధికారులను సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నామని, కానీ వారి నుండి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదని గ్రోసీ వెల్లడించారు. వీలైనంత త్వరగా ఈ అనివార్య మైన కమ్యూనికేషన్ ఛానెల్‌ను పునరుద్ధరించగలమని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# చిక్కుల్లో చమురు జీవనాడి

## హార్మూజ్ వద్ద 'సిగ్నల్స్ జామ్' .. 'దిక్కు'తోచని చమురు నౌకలు

### గందరగోళంలో 1,100 ట్యాంకర్లు!.. పూర్తిగా నెమ్మదించిపోయిన రవాణా

### అంతర్జాతీయ చమురు సరఫరాల్లో 20 శాతం ఇక్కడినుంచే.. భారత్ సహా పలు దేశాలపై తీవ్ర ప్రభావం



ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం అంతర్జాతీయంగా చమురు సరఫరాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇరాన్, ఒమన్ మధ్య ఉండే హార్మూజ్ జలసంధి ప్రపంచంలోనే అత్యంత బిజీ చమురు మార్గం. అంతర్జాతీయ చమురు సరఫరాలకు ఇది అత్యంత కీలకం. మొత్తం రోజువారీ చమురు, సహజవాయు సరఫరాల్లో 20 శాతం దీనిగుండానే జరుగుతూ ఉంటుంది. యుద్ధం దెబ్బకు ఇప్పుడక్కడ చమురు నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. ముఖ్యంగా సిగ్నల్స్ జామ్ అవుతుండటంతో మూడు రోజులుగా నౌకలు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. దాంతో భారత్‌తో పాటు పలు దేశాలకు చమురు ఇక్కట్లు తలెత్తుతున్న పరిస్థితి! దీనికి తోడు ఇరాన్ దాడుల కారణంగా సౌదీ అరేబియా కూడా తాజాగా చమురు ఉత్పత్తిని భారీగా తగ్గించడం మూలిగే నక్కపై తాటిపండు చందంగా మారింది. ఈ పరిణామాలతో చమురు ధరలకు కూడా రెక్కలొస్తున్నాయి.


**ఇరుకైన మార్గం**

హార్మూజ్ జలసంధి పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో అనుసంధానిస్తుంది. సౌదీ అరేబియాతో పాటు పశ్చిమాసియాలోని ఇరాన్, ఇరాక్ తదితర దేశాల చమురు, ఖతర్, యూఏఈ ఉత్పత్తి చేసే సహజ వాయువు రవాణాకు హార్మూజ్ ఏకైక మార్గం. దీనిగుండా ఒక్కో నౌక వెళ్లడానికి అత్యంత ఇరుకైన మార్గాలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. దాంతో జలసంధిని దాటేదాకా అవి అత్యంత జాగరూకంగా ఉండాల్సిందే. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ దాడులను కాచుకునే క్రమంలో పరస్పరం జీపీఎస్ జామింగ్, సిగ్నల్ స్పూఫింగ్‌కు దిగుతున్నాయి. దాంతో ఈ ప్రాంతమంతా ఎలక్ట్రానిక్ యుద్ధక్షేత్రంగా మారిపోయింది. ఇది నౌకల సిగ్నలింగ్ వ్యవస్థలనూ ప్రభావితం చేస్తోంది. దాంతో అవి తీవ్ర గందరగోళానికి గురవుతున్నాయి. తమ నావిగేషన్ వ్యవస్థలు తప్పుడు పొజిషన్లను చూపుతున్నట్టు నౌకల కెప్టెన్లు వాపోతున్నారు. ఈ డిజిటల్ బ్లాకౌట్ దెబ్బకు హార్మూజ్ వద్ద ఏకంగా 1,100కు పైగా చమురు నౌకలు ఇరుక్కుపోయినట్టు ఉపగ్రహ చిత్రాలను బట్టి వెల్లడవుతోంది.

**ఎలక్ట్రానిక్ బ్లాకౌట్**

నౌకలు తమ ప్రయాణానికి ప్రధానంగా గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్), ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టం (ఏఐఎస్)లపై ఆధారపడతాయి. ఇతర నౌకల పొజిషన్‌ను కూడా ఆ వ్యవస్థల ద్వారానే తెలుసుకుంటాయి. హార్మూజ్, పరిసర ప్రాంతాల్లో ఈ సిగ్నళ్లు రెండువైపులా దాడికి లోనవుతున్నాయి. మొదటిది జామింగ్. దీనివల్ల ఉపగ్రహాల సిగ్నళ్లు బలహీనమో, నిర్వీర్యమో అయిపోతున్నాయి. రెండోది స్పూఫింగ్. దీనిద్వారా నౌకల నావిగేషన్ కంప్యూటర్లు తప్పుడు కో ఆర్డినేట్స్ చూపిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ సైన్యం వాడుతున్న దేశీయ కోబ్రా వీ8, సయ్యద్-4 ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు 250 కి.మీ. పరిధిలోని ఉపగ్రహ సిగ్నల్స్‌ను పూర్తిగా గందరగోళపరుస్తున్నాయి. తద్వారా తమ యుద్ధనౌకలను అమెరికా, ఇరాన్ బారినుంచి కాపాడుకోవడం ఇరాన్ లక్ష్యం. అయితే ఎలక్ట్రానిక్ బ్లాకౌట్ ప్రభావం చమురు నౌకలపైనా తీవ్రంగా పడుతోంది. బ్లాకౌట్‌ను అధిగమించి హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటడం వాటికి దాదాపుగా అసాధ్యంగా మారుతోంది. గుడ్డిగా ముందుకెళ్తే నౌకలు పరస్పరం ఢీకొనే ప్రమాదం పొంచి ఉండటంతో ఆపరేటర్లు రిస్కు తీసుకోవడం లేదు. దాంతో జపాన్, దక్షిణ కొరియా, భారత్, చైనా వెళ్లాల్సిన చమురు నౌకలు పదుల సంఖ్యలో లంగరు వేసి నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గాలున్నా రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతాయి. పైగా ఆ మార్గాలను ఎంచుకునేందుకు నౌకా సంస్థలు కూడా సిద్ధంగా లేవు. దీనికి తోడు బీమా కంపెనీలు కూడా ఈ మార్గం గుండా సాగే నౌకల బీమా ప్రీమియాన్ని సగటున 50 శాతం దాకా పెంచేస్తున్నాయి! అంతేగాక యుద్ధం తాలూకు రిస్క్‌కు కవరేజీని నిరాకరిస్తున్నాయి.

# ఒక భార్య... ఇద్దరు భర్తలు



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్‌కు చెందిన 37 ఏళ్ల మహిళ దువాంగ్‌దువాన్ కెట్సారో వివాహం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. కనుల పండువగా జరిగినందుకో లేక అట్టహాసంగా జరిగినందుకో కాదు..పెళ్లి జరిగిన తీరు విచిత్రంగా ఉండటమే అందుకు కారణం. కెట్సారో ఇటీవల జరిగిన వేడుకలో ఆస్ట్రియాకు చెందిన ఇద్దరు వ్యక్తులను మనువాడింది. వీరిద్దరితో ఏళ్లుగా కొనసాగిస్తున్న బంధం నిజాయతీ, పరస్పర అంగీకారమే మూలమని ఆమె అంటోంది. గాయని, పాటల రచయిత అయిన కెట్సారో మొదటగా ఆస్ట్రియా వాసి రోమన్‌తో స్నేహం చేసింది. రిటైర్డు పోలీసు అధికారి అయిన రోమన్‌తో కలిసి పట్టాయా నగరంలో ఐదేళ్లపాటు కలిసి సహజీనం సాగించింది. ఆ సమయంలో వారి బంధం బలపడింది. తర్వాత, ఆస్ట్రియాకే చెందిన పోలీసు అధికారి మ్యాకీతో పరిచయమేర్పడింది. ఇతడికి దగ్గరైంది. వీరి ముగ్గురి మధ్య బంధం క్రమంగా ఒక అసాధారణ భాగస్వామ్యంగా రూపాంతరం చెందింది. ముగ్గురూ కలిసి కూర్చుని భవిష్యత్తులో కలిసి ఎలా ఉండాలనే విషయం చర్చించుకుని, ఒక నిర్ణయం తీసుకున్నారు. కాగా, కెట్సారోకు మొదటి వివాహం ద్వారా ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు మనవలు ఉన్నారు. తల్లిదండ్రులు, కుమార్తెలతోపాటు ఇతర కుటుంబసభ్యులకు సైతం ఆస్ట్రియా వాసులతో కొనసాగుతున్న బంధాన్ని గురించి తెలిపింది. పాటలు రాయడం, పాటడం ద్వారా ఆర్థిక కష్టాలు తీరక ఇబ్బందులు పడుతున్న సమయంలో రోమన్, మ్యాకీలు తనకెంతో బాసటగా నిలిచారని కెట్సారో అంటోంది. తన కుటుంబానికి కూడా సాయపడ్డారని తెలిపింది. ఇద్దరినీ పెళ్లి చేసుకుంటానని చెప్పగా కుటుంబసభ్యులు కూడా అంగీకారం తెలిపారని, వారు తన పట్ల చూపే శ్రద్ధ, అంకితభావమే ఇందుకు కారణమని పేర్కొంది. సంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ఈ పెళ్లికి ఆస్ట్రియా వరులు చెరో లక్ష బహాట్‌లు, మన కరెన్సీలో సుమారు రూ.29 లక్షలను కెట్సారోకు సమర్పించుకున్నట్లు సమాచారం. సమాజంలో మారుతున్న వివాహ సంబంధాలకు వీరి పెళ్లి తాజా ఉదాహరణగా భావిస్తున్నారు.

# టాక్సిక్ ఫస్ట్ సాంగ్ విడుదల.. నిరాశపరిచిన యశ్



కన్నడ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్' (Toxic). ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకులను మెప్పించింది. అయితే, తాజాగా ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. యశ్, కియారా ఆద్వాణిల మధ్య సాగే 'తాబాహీ..' ఈ పాటను విశాల్ మిశ్రా ఆలపించగా రామజోగయ్య శాస్త్రి తెలుగు సాహిత్యం రాశారు. టాక్సిక్‌లో నదియా అనే పాత్రలో కియారా నటిస్తున్న విషయం తెలిసిందే. టాక్సిక్ మూవీ నుంచి తాజాగా విడుదలైన ఈ పాట మొదటిసారి వినగానే బాగుంది. కానీ, మరింత బలంగా ఆకర్షించేందుకు మరికొంత సమయం పట్టొచ్చు. సినిమా నుండి రొమాంటిక్ సాంగ్‌ను ఆశించిన వారు కొంచెం నిరాశ చెందవచ్చు. ఒకే పోస్టర్‌తో సాంగ్‌ను విడుదల చేశారు. కనీసం వీరిద్దరి స్టిల్స్, విజువల్స్ చేర్చకుండా పాటను విడుదల చేయడంతో ఇది అభిమానులను మరింత నిరాశపరచవచ్చు. ఈ సినిమా మార్చి 19న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది.

# సూర్య- వెంకీ సినిమా టైటిల్ ఫిక్స్..



సార్, లక్కీ భాస్కర్ చిత్రాలతో ఇతర భాషా హీరోలకు ఘన విజయాలను అందించాడు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. ఇప్పుడు ఈయన కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో సినిమా చేస్తున్నాడు. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం (మార్చి 2న) రిలీజ్ చేశారు. సూర్య కెరీర్‌లో 46వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు విశ్వనాథ్ అండ్ సన్స్ అనే టైటిల్ ఖరారు చేశారు.

**ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా**


పోస్టర్‌లో కళ్లజోడు ధరించిన హీరో సూర్య చిన్న బాబును ఎత్తుకుని స్టైలిస్ట్‌గా కనిపిస్తున్నాడు. ఇది మనసును తాకే ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా అని మూవీ టీం ప్రకటించింది. జూలైలో సినిమా రిలీజ్ చేస్తామని పేర్కొంది. ఈ మూవీలో ప్రేమలు హీరోయిన్ మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. రవీనా టండన్, రాధికా శరత్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

**సినిమా**

మరోవైపు సూర్య చేతిలో ఇంకో రెండు సినిమాలున్నాయి. ఒకటి.. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న కరుప్పు మూవీ.. ఇందులో సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో త్రిష కథానాయిక. మరోటి.. మలయాళ డైరెక్టర్ జిత్తు మాధవన్ డైరెక్షన్‌లో మూవీ చేస్తున్నాడు. ఇందులో సూర్య పోలీసాఫీసర్‌గా నటిస్తున్నాడు. ఇందులో నజ్రియా హీరోయిన్‌గా కనిపించనుంది.

# ముంబైలో మలైకా అరోరా కొత్త రెస్టారెంట్





ముంబైలోని రద్దీగా ఉండే ఖార్ (Khar) వీధుల్లో ఒక ప్రశాంతమైన లోకం ఆవిష్కృతమైంది. ప్రముఖ రియాలిటీ టీవీ స్టార్ మలైకా అరోరా, రెస్టారెంట్ దిగ్గజం ధవల్ ఉదేశీతో కలిసి 'స్వీనీ' పేరుతో ఒక సరికొత్త డైనింగ్ డెస్టినేషన్‌ను ప్రారంభించారు. ఇది కేవలం ఒక హోటల్‌లా కాకుండా, పచ్చని ప్రకృతి మధ్య ఉన్న ఒక ప్రైవేట్ బంగ్లాను తలపిస్తోంది.

బ్రిటిష్ కాలం నాటి వైభవం.. ఆధునిక హంగులు

ఈ రెస్టారెంట్ థీమ్ గురించి మలైకా సోషల్ మీడియాలో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బ్రిటిష్ కాలం నాటి 'కలోనియల్' శైలికి, నేటి ఆధునిక 'మోడరన్' హంగులను జోడించి దీనిని తీర్చిదిద్దారు.

**140 ఏళ్ల నాటి మామిడి చెట్టు:**

ఈ ప్రాపర్టీకి ప్రధాన ఆకర్షణ అక్కడ ఉన్న 140 ఏళ్ల నాటి భారీ మామిడి చెట్టు. రెస్టారెంట్‌లోని సగానికి పైగా అవుట్‌డోర్ ఏరియాకు ఈ చెట్టే సహజమైన నీడను ఇస్తుంది.

**డిజైన్:**

థాయ్ ఆర్కిటెక్చర్ నుంచి స్ఫూర్తి పొంది, లోపలి నుంచి బయటి వరకు గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా దీనిని నిర్మించారు.

**అవుట్‌డోర్: ఒక పచ్చని ఒయాసిస్**

రెస్టారెంట్ ప్రవేశ ద్వారం వద్ద మింట్‌గ్రీన్ కలర్ తోరణం, ఆరెంజ్‌వైట్ కాంబినేషన్ కార్పెట్ అతిథులకు గ్రాండ్ వెల్‌కమ్ చెబుతాయి. లోపల వెదురుతో చేసిన కుర్చీలు, నలుపు రంగు కుషన్లు వింటేజ్ లుక్‌ను ఇస్తాయి. గోడలకు ఉన్న పెద్ద పెద్ద గోల్డ్ ఫ్రేమ్ అద్దాలు చుట్టూ ఉన్న చెట్లను ప్రతిబింబిస్తూ, అదొక అనంతమైన తోటలా అనిపించేలా చేస్తాయి.

**ఇంటీరియర్: విలాసవంతమైన సోయగం**

లోపలికి వెళ్తే వాతావరణం మరింత హుందాగా మారుతుంది.

**బార్ కౌంటర్:**

వెదురు ఆకారంలో ఉండే తోరణాల మధ్య భారీ బ్యాక్‌లిట్ బార్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇది నలుపుతెలుపు మార్బుల్‌తో రాజసం ఉట్టిపడేలా ఉంటుంది.

**షాన్డిలియర్లు:**

ఆకుల ఆకారంలో ఉండే ఫ్రోస్టెడ్ గ్లాస్ షాన్డిలియర్లు హోటల్‌కు ఒక వెచ్చని, ఆహ్లాదకరమైన వెలుగును ఇస్తాయి.

**మలైకా వ్యక్తిగత అభిరుచి**

"ప్రయాణాలు నా జీవితంలో ఒక భాగం. థాయ్, యూరోపియన్ హోమ్‌స్టైల్ వంటకాలు నాకు చాలా ఇష్టం. ఆ ఇష్టమే ఈ రెస్టారెంట్ స్థాపనకు పునాది" అని మలైకా ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రెస్టారెంట్‌లోని గోడలకు ఏ రంగు వేయాలనే విషయంలో కూడా మలైకా చాలా శ్రద్ధ తీసుకున్నారు. తనకు నచ్చిన 'సేజ్ గ్రీన్' రంగు కోసం ఏకంగా ఆరుసార్లు పెయింటింగ్ మార్పించారంటే ఆమెకు ఈ ప్రాజెక్ట్ ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు.

# నా మెదడు పదేళ్లు వెనక్కి వెళ్లింది

గ్లోబల్ వేదికలపై మన తారలు మెరిసినప్పుడు ప్రశంసలతో పాటు కొన్నిసార్లు విమర్శలు కూడా ఎదురవుతుంటాయి. రీసెంట్‌గా జరిగిన బాఫ్టా 2026 అవార్డుల వేడుకలో తన అందంతో మెస్మరైజ్ చేసిన అలియా భట్ ఓ సినిమాపై చేసిన కామెంట్లతో ట్రోలింగ్‌కు గురైంది.

## గాన్ గర్ల్ సినిమా గురించి..

ఈ అవార్డు వేడుకల్లో ప్రజెంటర్‌గా అలరించిన అలియా భట్ ఒక ఇంటర్వ్యూలో 'గాన్ గర్ల్' సినిమా గురించి మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఈ విషయంపై బాఫ్టా అలియా తన మనసు విప్పారు.

## ఏం జరిగిందంటే?

బాఫ్టా 2026 రెడ్ కార్పెట్ మీద ఒక ఇంటర్వ్యూయర్ అలియాను పలకరిస్తూ.. "మీకు బాగా నచ్చిన సినిమా ట్విస్ట్ ఏది?" అని అడిగారు. అలియా భట్ కాస్త తడబడుతూ 'గాన్ గర్ల్' సినిమా పేరు చెప్పారు. ఆ సమయంలో అలియా భట్ ముఖకవళికలు, బాడీ లాంగ్వేజ్ చూసి.. అసలు ఆమె ఆ సినిమా చూశారా? లేదా కావాలనే ఇంటర్నేషనల్ స్టార్‌లా పోజు కొడుతున్నారా? అంటూ నెటిజన్లు ట్రోల్ చేశారు.

## "నా మెదడు పదేళ్ల వెనక్కి వెళ్లింది"

ఈ విమర్శలపై ప్రముఖ ఫ్యాషన్ కామెంటేటర్ 'డైట్ సబ్య'తో అలియా భట్ మాట్లాడారు. "దీని గురించి ఇంతగా ఎందుకు చర్చించుకుంటున్నారు? నా ఎక్స్‌ప్రెషన్స్ వల్లేనా?" అని ప్రశ్నించిన అలియా, అసలు ఆ క్షణంలో తన మెదడులో ఏం నడుస్తుందో వివరించారు. "నిజానికి 'గాన్ గర్ల్' సినిమా విడుదలై పదేళ్లు దాటిపోయింది. నేను ఆ సినిమా చూసి కూడా చాలా కాలమైంది. ఇంటర్వ్యూయర్ ఆ సినిమాలో మోనోలాగ్ గురించి, ఫ్లోర్ క్లీన్ చేసే సీన్ గురించి అడుగుతుంటే.. నా మెదడు ఆ పాత జ్ఞాపకాలను వెతుక్కోవడానికి పదేళ్ల వెనక్కి వెళ్లింది. ఆ సమయంలో నా ముఖంలో కనిపించిన తడబాటు అదే" అలియా భట్ వివరణ ఇచ్చారు.


## అంత కూల్ అమ్మాయిని కాదు

"నిజం చెప్పాలంటే నేను అంత కూల్ అమ్మాయిని ఏమీ కాదు. నా సోదరి చెప్పినట్లు నేను చాలా 'అన్‌కూల్' (Uncool) పర్సన్‌ని" అంటూ అలియా భట్ నవ్వుతూ సమాధానమిచ్చారు.

## సినిమా విశేషాలు

ఇదిలా ఉంటే, అలియా భట్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వైఆర్ఎఫ్ (YRF) స్పై యూనివర్స్‌లో వస్తున్న లేడీ ఓరియెంటెడ్ స్పై థ్రిల్లర్ 'ఆల్ఫా' (Alpha)లో అలియా భట్ నటిస్తున్నారు.





# రైరై రారా అంటోన్న రామ్ చరణ్..

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన చికిరి చికిరి సాంగ్ ఆడియన్స్‌ను ఓ ఊపు ఊపేసింది. తాజాగా ఈ సినిమా నుంచి రైరై రారా అంటూ సాగే మరో సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించగా.. ఏఆర్ రెహమాన్ పాడారు. ఈ మోటివేషనల్ సాంగ్‌ను రెహమాన్ కంపోజ్ చేశారు. ఈ సినిమా ఏప్రిల్ 30న థియేటర్లలో సందడి చేయనుంది.



# పాట అసలైన గెలుపు అక్కడే ఉంటుంది

## స్టార్ సింగర్ శ్రేయా ఘోషల్

ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ తన మధురమైన గొంతుతో దశాబ్దాలుగా కోట్లాది మంది సంగీత ప్రియులను అలరిస్తున్నారు. నేటి డిజిటల్ యుగంలో ఒక పాట హిట్టా కాదా అనేది యూట్యూబ్ వ్యూస్, ఇన్‌స్టాగ్రామ్ లైకులను బట్టి లెక్కేస్తున్నారు. అయితే, శ్రేయా ఘోషల్ మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రేయా ఘోషల్ పాట అసలైన విజయం ఎక్కడ ఉంటుందో తనదైన శైలిలో వివరించారు. "ఈ రోజుల్లో లైకులు, వ్యూస్ అనేవి చాలా మోసపూరితమైనవి. ఎందుకంటే డబ్బు ఉంటే దేన్నైనా కొనేయొచ్చు (హర్ చీజ్ ఖరీదీ జా సక్తీ హై). కానీ, నేను ఒక కచేరీలో (కాన్సర్ట్) పాడుతున్నప్పుడు.. అక్కడి ప్రేక్షకులు నాతో కలిసి ఆ పాటను పాడుతుంటే, ఆ పాటను మనస్ఫూర్తిగా ఓన్ చేసుకుంటే.. అదే ఆ పాట సాధించిన అసలైన విజయం" అని శ్రేయా ఘోషల్ పేర్కొన్నారు. మొదటిసారి పాడిన పాటను కూడా ప్రేక్షకులు గుర్తుపెట్టుకుని, మళ్లీ పాడమని కోరినప్పుడే ఒక కళాకారుడికి దక్కే అతిపెద్ద గౌరవం అని శ్రేయా ఘోషల్ చెప్పుకొచ్చారు. కచేరీలలో కనిపించే ఆ 'మల్టిప్లిసిటీ ఎఫెక్ట్' మాత్రమే పాట సక్సెస్‌కు నిజమైన కొలమానం అని శ్రేయా వివరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com